జాతీయ దినపత్రిక
Postail Licence No. L/KNL/3-52(D) 2018 - 2020

# ఉదయం న్యూస్

ఎడిటర్ : సి. శేఖర్ యం
Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :03 సంచిక :263 పేజీలు 8 వెల : 5 గురువారం 12 జూన్ 2025

జాతీయ దినపత్రిక
ఉదయం న్యూస్
ఎడిటర్ : సి. శేఖర్ యం
వాస్తవాల్లే వార్తలుగా వ్రాసే సత్తా ఉన్న దినపత్రిక

CELEBRATING 9 Years ANNIVERSARY
వార్షికోత్సవ
ప్రత్యేక సంచిక

ప్రకటనదారులకు, పాఠకులకు మా నమస్సుమాంజలులు...
9వ వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేయుట గురించి పాఠకులారా !.. ఉదయం దినపత్రికను హృదయపూర్వకంగా అభిమానించినందుకు మేనేజ్‌మెంట్ మీకు అభినందనలు తెలియజేస్తుంది.
వాస్తవాలే వార్తలుగా మలుచుకొని నిజాన్ని ఇజంగా చేసుకొని నిరంతరం నూతన వరవడిలో పత్రికను మీ ముందుకు తెస్తున్నామన్నా విషయం మీకందరికీ తెలిసిందే.
పత్రిక నడవాలంటే ఆర్థిక మూలాలు ముఖ్యం. కావున మీరంతా వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనులు మంజూరు చేసి పత్రికాభివృద్ధికి మీ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందజేయవలసిందిగా ఆకాంక్షిస్తున్నాము ....
మీ... ఉదయం దినపత్రిక ఎడిటర్

తారీఫ్

| | |
|---|---|
| | బ్లాక్ & వైట్ పేజీ |
| బ్యాక్ కవర్ పేజీ మల్టీకలర్ : 50,000/- | బ్యాక్ పేజీ : 20,000/- |
| ఇన్నర్ మల్టీకలర్ పేజీ : 20,000/- | ఇన్నర్ పేజీ : 20,000/- |
| ఫ్రంట్ మల్టీకలర్ పేజీ : 70,000/- | ఫ్రంట్ పేజీ : 30,000/- |

ప్రకటనదారులకు విజ్ఞప్తి...
గమనిక : సకాలంలో ప్రకటనల తాలుకా ఫోటోలు మరియు మెటీరియల్‌ను ఉదయం తెలుగు దినపత్రిక విలేకరులకు అందజేయవలసిందిగా కోరడమైనది.



# ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతుల ఆత్మహత్యలు

- గిట్టుబాటు ధరలు లేక రైతన్నల ఆందోళన
- మా హయాంలో రైతులకు స్వర్ణయుగం
- రైతన్నలకు రైతుభరోసా ఇచ్చి ఆదుకున్నాం
- పొదిలిలో పొగాకు రైతలను పరామర్శించిన జగన్
- కూటమి ప్రభుత్వం వైఫల్యాలపై ఆగ్రహం

2 లో

రైతు భరోసా కింద ఇస్తున్న సొమ్ము ఆగిపోయింది.. మోడీ ఇచ్చే ఆరు వేలు కాక.. మరో 20 వేలు ఇస్తామని చెప్పారు.. జూన్ వచ్చినా ఇంత వరకు రైతులకు పెట్టు-బడి సాయం అందలేదని ఆరోపించారు. ఇక, మేము అధికారంలో ఉన్నప్పుడు ఇన్ పుట్ సబ్సిడీ అందించే వాళ్ళం..ఆర్బీకేలతో ఉచిత పంటల బీమా అందించాం.. ఎరువులు, విత్తనాలు, పురుగుల మందుల నాణ్యతకు ప్రభుత్వమే గ్యారంటీ ఇచ్చింది..



2 లో

## మళ్లీ పెరిగిన పుత్తడి ధరలు



2 లో

## ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల మోత

ఆందోళనలో తల్లిదండ్రులు




2 లో

## మంగ్లీ బర్త్‌డే పార్టీలో విదేశీ మద్యం, గంజాయి

రిసార్టులో పార్టీపై ఎస్‌వోటి పోలీసుల దాడి

గాయని మంగ్లీపై కేసు నమోదు



# కూటమి సర్కార్ ఏడాది పాలన

### ఏడాది పాలనపై నేడు బాబు సందేశం

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్డీయే కూటమి సర్కార్ ఏర్పాటై నేటికి ఏడాది పూర్తి అవుతుంది. స్వపరిపాలన – స్వర్ణాంధ్ర ప్రదేశ్ పేరుతో అమరావతిలో రాష్ట్ర స్థాయి సభ ఏర్పాటుకు సన్నాహాలు కొనసాగుతున్నాయి. అమరావతిలో నేటి సాయంత్రం 5 గంటలకు భారీ బహిరంగ సభను ఏర్పాటు చేశారు. ఏడాది పాలనలో ప్రభుత్వం సాధించిన ప్రగతిపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ– సీఎం పవన్ కళ్యాణ్ ప్రసంగాలు చేయనున్నారు. మరోవైపు, సభ జరిగే ప్రాంతంలో రాత్రి భారీ వర్షం కురిసింది. ఈ నేపథ్యంలో సభా ప్రాంగణం పూర్తిగా తడిసి పోయింది. దీంతో వేదిక మార్చాలా.. సచివాలయం వెనక ప్రాంతంలోనే సభా ఏర్పాట్లు– చేయ్యాలా అనే ఆలోచనలో అధికారులు ఉన్నారు.ఏపీ సచివాలయం వెనక సభ ఏర్పాట్లు– చేస్తున్నారు అధికారులు.. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటి సీఎం పవన్ కళ్యాణ్, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ లు, ఎంపీలు హాజరుకానున్నారు. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న సందర్భంగా అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు తప్పకుండా హాజరు కావాలని రాష్ట్ర సర్కార్ ఆదేశాలు జారీ చేసింది.

# గ్రూప్-1 నియామకాలపై స్టే ఎత్తేయండి

## హైకోర్టును ఆశ్రయించిన నలుగురు అభ్యర్థులు

హైదరాబాద్:ప్రజావెలుగున్యూస్ :తెలంగాణలో గ్రూప్-1 నియామకాలపై స్టే ఎత్తివేయాలని కోరుతూ హైకోర్టును పలువురు ఆశ్రయించారు. ఈ మేరకు నాలుగు పిటిషన్లు దాఖలయ్యాయి. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షా కేంద్రాల కేటాయింపు, మూల్యాంకనంలో అక్రమాలు చోటు చేసుకున్నాయని పలువురు అభ్యర్థులు గతంలో హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. గత నెలలోనే ఈ పిటిషన్లపై వాదనలు జరిగాయి. పునర్మూల్యాంకనం చేయాలని లేదా మరోసారి మెయిన్స్ నిర్వహించాలని పిటిషనర్ల తరపు న్యాయవాదులు కోరారు. అభ్యర్థులు



కేవలం అపోహపడుతున్నారని, నిపుణులతో మెయిన్స్ పత్రాల మూల్యాంకనం చేయించామని టీ-జీపీఎస్సీ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. గ్రూప్-1 నియామకాలు ఆలస్యమైతే ఎంపి-కై-న అభ్యర్థులు నష్టపోతారని పేర్కొన్నారు. వాదనలు విన్న న్యాయస్థానం గ్రూప్-1 నియామకాలపై స్టే విధించింది. సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేయొచ్చని ఆదేశించింది. గ్రూప్-1 నియామకాలపై విధించిన స్టేను ఎత్తివేయాలని కోరుతూ గ్రూప్-1కు ఎంపికైన నలుగురు అభ్యర్థులు ఉన్నత న్యాయస్థానంలో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. బుధవారం విచారణ సందర్భంగా స్టే వెకెట్ పిటిషన్లపై వాదనలు జరిగాయి. కౌంటరు దాఖలు చేయడానికి టీజీపీఎస్సీ, ఇతర న్యాయవాదులు సమయం కోరారు. విచారణను ఆలస్యం చేయొద్దని, దీని వల్ల ఎంపి-కై-న అభ్యర్థులకు ఇబ్బందులు ఉంటాయని హైకోర్టు తెలిపింది. వినిపించిన వాదనలే మళ్లీ వినిపించొద్దని, ఈనెల 30న పూర్తి స్థాయి వాదనలు వింటామని ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.



# కాళేశ్వరంతో కరువును తరిమిన నేత

- తెలంగాణ దాహాన్ని తీర్చిన దార్శినికుడు
- ఇరిగేషన్‌పై కెసిఆర్‌కున్న అవగాహన మరెవ్వరికీ లేదు
- తెలంగాణ సాధించిన నేతగా..సస్యశ్యామలం చేసిన నేతగా గుర్తింపు
- చరిత్రలో కెసిఆర్ పేరు సువర్ణాక్షరాలతో లిఖించబడింది
- కెసిఆర్‌ను దార్శనికతను అర్థం చేసుకోవడం కాంగ్రెస్‌కు అసాధ్యం
- విచారణల పేరుతో రేవంత్ రెడ్డి కెసిఆర్ వెంట్రుక కూడా పీకలేదు
- మీడియాతో బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్

2 లో

కేసీఆర్ అంటే ఒక చరిత్ర.. ఇరిగేషన్ విషయంలో కేసీఆర్‌ను విచారణకు పిలిచారంటే.. హనుమంతుడి ముందు కుప్పిగంతులు లాంటిది. ఇరిగేషన్ మీద కేసీఆర్‌కు ఉన్న అవగాహన బహుషా ఈ దేశంలోని సమకాలీన రాజకీయ నాయకులలో ఎవరికి ఉండదు. చివరకు ధర్మం, న్యాయమే గెలుస్తది.

# రైతులకు అండగా కూటమి సర్కార్

### ఏరువాక సందర్భంగా నాగలి పట్టిన అనిత

అనకాపల్లి:రైతు దేశానికి వెన్నుముక.. రైతులకు ఎన్డీయే ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుంది.. టెక్నాలజీకి అనుగుణంగా ఆధునీకరణ పరికరాలు కూడా రైతులకు అందజేస్తున్నామని హోంమంత్రి అనిత వెల్లడించారు. జిల్లాలోని పాయకరావుపేట నియోజకవర్గంలో హోం మంత్రి వంగలపూడి అనిత పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్.రాయవరం మండలం గెడ్డపాలెం గ్రామంలో ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏరువాక కార్యక్రమంలో



భాగంగా భూమి పూజ చేసింది. కాడెడ్లతో నాగలి పట్టుకొని మంత్రి అనిత పొలం దున్నారు.. అలాగే, రైతులకు రాయితీపై విత్తనాలు పంపిణి చేసింది. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా 80 శాతం రాయితీపై డ్రోన్ ప్రారంభించింది. ఇక, హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ.. రైతులకు ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. నేడు డ్రోన్లు ఉపయోగించి, రైతులు వ్యవసాయం చేస్తున్నారు.. 80 శాతం రాయితీపై రైతులకు డ్రోన్లు ఇస్తున్నాం.. పాడి పంటలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుతున్నాను అని మంత్రి అనిత చెప్పుకొచ్చారు. నేడు డ్రోన్లను ఉపయోగించి, రైతులు వ్యవసాయం చేస్తున్నారని చెప్పారు.

# ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతుల ఆత్మహత్యలు



**ఒంగోలు:** రాష్ట్రంలో ప్రభుత్వం పట్టించుకునే పరిస్థితి లేక రైతులను ఆత్మహత్యలు చేసుకుంటున్నారని మాజీ సీఎం వైఎస్ జగన్ ఆరోపించారు. ఈ జిల్లాలో ఇద్దరు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు.. కొండపి, పర్చూరులో గిట్టుబాటు ధరలు లేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు.. రైతాంగ సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తున్నాం.. ఏ రైతు చూసినా తక్కువ ధరలకు తమ పంటలను అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వైఎస్ జగన్ మండిపడ్డారు. ప్రకాశం జిల్లాలోని పొదిలిలోని పొగాకు బోర్డు దగ్గరకు వెళ్లిన మాజీ సీఎం వైఎస్ జగన్.. పొగాకు రైతులను పరామర్శించి వారితో ముఖాముఖి సమావేశంలో పాల్గొన్నారు. రైతులను అడిగి పొగాకు కొనుగోలు రేట్ల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైసీపీ అధినేత జగన్ మాట్లాడుతూ.. ఇక, వరి, మిర్చి, పొగా పంట చూసినా గిట్టుబాటు ధర లేదు అని జగన్ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. గత ఏడాది వైసీపీ పాలనలో రైతులకు గిట్టుబాటు- ధరలు ఇచ్చాం.. పంట వేసే సమయంలోనే రైతన్నలకు రైతు భరోసా అందించాం అని సూచించారు. గత ఏడాది

రైతు భరోసా కింద ఇస్తున్న సొమ్ము ఆగిపోయింది.. మోడీ ఇచ్చే ఆరు వేలు కాక.. మరో 20 వేలు ఇస్తామని చెప్పారు.. జూన్ వచ్చినా ఇంత వరకు రైతులకు పెట్టు-బడి సాయం అందలేదని ఆరోపించారు. ఇక, మేము అధికారంలో ఉన్నప్పుడు ఇన్ పుట్ సబ్సిడీ అందించే వాళ్ళం..ఆర్బీకేలతో ఉచిత పంటల బీమా అందించాం.. ఎరువులు, విత్తనాలు, పురుగుల మందుల నాణ్యతకు ప్రభుత్వమే గ్యారంటీ ఇచ్చింది.. కానీ, ఈ ప్రభుత్వం మాత్రం రైతులను పూర్తిగా గాలికి వదిలేసిందని జగన్ ఆరోపణలు చేశారు. అయితే, వైసీపీ ప్రభుత్వ హయాంలో మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేశామని వైఎస్ జగన్ తెలిపారు. ప్రతీ రైతుకు ఎకరాకు అదనంగా 10 వేలు ఇచ్చే వాళ్ళం.. మూడు వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు- చేసి రైతులను ఆదుకున్నాం..

కేంద్రం ప్రకటించిన పంట్కే కాకుండా పలు పంటలకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేయించాం.. ఏ పంటకైన గిట్టుబాటు ధర రాని పరిస్థితి ఉంటే ప్రభుత్వం పట్టించుకుని కొనుగోలు చేసే పరిస్థితి ఉండేది.. పొగాకు పంటకు గత ఏడాది కేజీ 360 రూపాయలకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకున్నాం.. కానీ, ప్రస్తుత ప్రభుత్వం పొగా రైతులను పట్టించుకుందని వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వెల్లడించారు. మా హయాంలో రైతు రాజ్యం నడిచింది. కానీ, కూటమి ప్రభుత్వంలో రైతు నష్టపోతున్నాడు. మా హయాంలో ఖరీఫ్ సీజన్‌లోనే పెట్టుబడి సాయం అందించాం. చంద్రబాబు వచ్చాక రైతు భరోసా సాయం లేదు. కేంద్రం ఇచ్చే రూ.6 వేలు కాకుండా మరో రూ.20 వేలు ఇస్తామని చంద్రబాబు అన్నారు. గతేడాది రైతు భరోసా రూ.20 ఎగ్గొట్టారు. మా ప్రభుత్వంలో రైతుకు కనీస మద్దతు ధర ఇచ్చాం. ప్రతీ రైతుకు అదనంగా రూ.10 వేలు ఇచ్చేవాళ్లం. పారదర్శకంగా ఉచిత బీమా అందించాం. మా హయాంలో రైతుకు వెన్నెముకగా ఆర్బీకేలు నిలిచాయి. రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు- చేశాం. మార్కెట్‌లో పోటీ- పెరిగి రైతుకు గిట్టు-బాటు- ధర వచ్చేది. కేంద్రం ప్రకటించిన పంటలకే కాకుండా.. రాష్ట్రం నుంచి అనేక పంటలకు కనీస మద్దతు ధర ఇచ్చాం. ఏ పంట-కై-నా గిట్టు-బాటు- ధర లేకుంటే ఆర్బీకే ద్వారా ఇచ్చేవాళ్లం. ఐదెకరాల మిర్చి రైతులకు రూ.4లక్షల పరిహారం ఇచ్చిన ఘనత మాది. మా హయాంలో రైతులకు సువర్ణ యుగం. ఏ రకంగానూ రైతును నష్టపోనివ్వలేదని జగన్ అన్నారు. కూటమి వచ్చాక ఉచిత బీమా ఎత్తేశారు. దళారీలు లేకుండా ఇప్పుడు పంట కొనే పరిస్థితి లేదు. ఈ క్రాప్ వ్యవస్థను నీరుగార్చారు. కూటమి వచ్చాక ఇన్‌పుట్ సబ్సీడీని గాలికొదిలేశారు. కల్తీ ఎరువులు, కల్తీ విత్తనాలతో నష్టపోతున్నారు. 2023-24లో కేజీ పొగాకు రూ.366కి అమ్ముడుపోయేది. ఇప్పుడు రూ.240 కూడా అమ్ముడుపోవడం లేదు. క్వింటా పొగాకు రూ.24 వేలు తగ్గకుండా రైతు అమ్ముకున్నాడు. 220 మిలియన్ టన్నులు ప్రొక్యూర్ చేయాల్సి ఉంటే.. కేవలం 40 మిలియన్ టన్నులే ప్రొక్యూర్ చేశారు. హైగ్రేడ్ పొగాకుకు కూడా ఈరోజు గిట్టు-బాటు- ధర దక్కడం లేదు. పొగాకు బ్లాక్ బర్లీ రైతు ఎకరాకు రూ.80వేలు నష్టపోతున్నాడు. చంద్రబాబు సీఎం కావడం రైతులకు శాపం. మా హయాంలో మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించాం. మార్క్‌ఫెడ్ రావడంతో మార్కెట్‌లో పోటీ- పెరిగింది. మీరెందుకు ఆ పని చేయలేదు?. అసలు ప్రభుత్వం ఎందుకు మార్క్‌ఫెడ్ వేలంలో పాల్గొనలేదు. బాబు, దళారుల మధ్య సంబంధాలతో రైతులు నష్టపోతున్నారు. వ్యవసాయం దండగ అనే రీతిలో చంద్రబాబు పాలన కొనసాగుతోంది. పొగాకు వేసుకోమని చెప్పి రైతులను నట్టేట ముంచుతున్నారు. రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలి. లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తాం జగన్ హెచ్చరికలు జారీ చేశారు. జగన్ వెంట చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి,వైవి సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

# మళ్లీ పెరిగిన పుత్తడి ధరలు



**న్యూఢిల్లీ:** వరుసగా మూడు రోజుల పాటు తగ్గుతూ వచ్చిన బంగారం ధరలు బుధవారం తిరిగి భారీగా పెరిగాయి. ప్రస్తుతం అమెరికాలో కొనసాగుతున్న ఆందోళలతో పాటు- ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రపంచ వాణిజ్య పరిస్థితులు బంగారం, వెండి వంటి లోహాల ధరలపై భారీగా ప్రభావితం చేస్తోంది. ఈ నేపథ్యంలో నేడు హైదరాబాద్ లో బంగారం ధరల విషయానికి వస్తే.. 24 క్యారెట్ల బంగారం 10 గ్రాములు రూ. 820 పెరిగి 10 గ్రాములకు ధర రూ. 98,400 వద్ద ట్రేడ్ అవుతుంది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.750 పెరిగి 10 గ్రాములకు ధర రూ. 90,200గా, 18 క్యారెట్ల బంగారం (10 గ్రాములు) రూ.610 పెరిగి రూ. 73,190 వద్ద ట్రేడ్ అవుతుంది. ఇది ఇలా ఉండగా బంగారం ధరలు భారీగా పెరిగిన వెండి ధరలలో మాత్రం ఎటువంటి మార్పు లేకపోవడం సంతోషకరమైన విషయం. హైదరాబాద్ లో కేజీ వెండి ధర నిన్నటి ధరలో ఎటు-వంటి తేడా లేకుండా రూ. 1,19,000 వద్ద ట్రేడ్ అవుతోంది.

# కాళేశ్వరంతో కరువును తరిమిన నేత



హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రాష్ట్రం కరువుకు, దాహానికి శాశ్వత పరిష్కారం చూపించారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ అన్నారు. కేసీఆర్ బలం, జీవన దృక్కోణాన్ని అర్థం చేసుకోవడానికి జోకర్ కాంగ్రెస్ నాయకులకు జీవితకాలం కూడా చాలదు. అల్ప మనస్తత్వం ఉన్న కాంగ్రెస్ నాయకులు వందజన్మలు ఎత్తినా కూడా కేసీఆర్ సాధించిన విజయాల్లో పదవంతైనా సాధించలేరు అని కేటీఆర్ పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి కేసీఆర్ వెంట్రుకను కూడా పీకలేదని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. కెసిఆర్ కాళేశ్వరం విచారణకు హాజరయిన సందర్భంగా, బీఆర్కే భవన్ వద్ద కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ అంటే ఒక చరిత్ర.. ఇరిగేషన్ విషయంలో కేసీఆర్‌ను విచారణకు పిలిచారంటే.. హనుమంతుడి ముందు కుప్పిగంతులు లాంటిది. ఇరిగేషన్ మీద కేసీఆర్‌కు ఉన్న అవగాహన బహుషా ఈ దేశంలోని సమకాలీన రాజకీయ నాయకులలో ఎవరికి ఉండదు. చివరకు ధర్మం, న్యాయమే గెలుస్తది. తెలంగాణను సాధించిన నాయకుడిగా, సస్యశ్యామలం చేసిన నాయకుడిగా కేసీఆర్ పేరు చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించబడుతది అని కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ జీవితం ఒక చరిత్రగా నిలిచిపోతుంది అని కొనియాడారు. గత ప్రభుత్వాలు 60 ఏళ్లలో చేయలేని అనేక కార్యక్రమాలను కేసీఆర్ విజయవంతంగా సాధించారు. ప్రజాస్వామ్య పోరాటంతో, తెలంగాణ ఆర్తితో తెలంగాణ కోసం, కేవలం తెలంగాణ కోసమే కేసీఆర్ పనిచేశారు. ఉద్యమం ద్వారా కోట్లాది మందికి స్వరాష్ట్ర ఆశయాన్ని అందించారు. ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమించి తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చారని కేటీఆర్ పేర్కొన్నారు.రేవంత్ రెడ్డి కూలగొట్టడానికి వచ్చాడు తప్ప కట్టడానికి రాలేదు. విధ్వంసకర మైన ఆలోచనలతో పేదల ఇండ్లు కూలగొట్టడం, ప్రాజెక్టులను కూలగొట్టడం.. రాజకీయ వేధింపులు, కక్ష సాధింపులు తప్ప ఈ సన్నాసికి ఏం చేతకాదు అని అర్థమైతుందని ఘాటు విమర్శలు చేశారు. వంద జన్మలు ఎత్తినా రేవంత్ రెడ్డి అనే చిల్లరగాడికి కేసీఆర్ గొప్పతనం అర్థం కాదు. రేవంత్ రెడ్డి గురువు, ఆయన జేజమ్మతో గొడవ పడి ఇక్కడ నుండి తరిమిన వాడే కేసీఆర్. రేవంత్ రెడ్డి అనే చిల్లరగాడు ఏం చేసినా, ఆయన ప్రభుత్వం ఏం చేసినా కేసీఆర్ వెంట్రుక కూడా పీకలేడు. రేవంత్ రెడ్డిని వదిలిపెట్టం.. కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టేదాకా వెంటాడుతాం అని కేటీఆర్ తేల్చిచెప్పారు. ఈ చిల్లర రాజకీయాలను పట్టించుకోవద్దని రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నా. ఆరు గ్యారెంటీలు, 420 హామీలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉండాలి. రేవంత్ రెడ్డిని ప్రజాక్షేత్రంలో బట్టలిప్పి నిలబెట్టే రోజులు వస్తాయి. రేవంత్ రెడ్డి లాంటి చిల్లర నాయకుడికి కేబినెట్ అంటే అర్థం కాదు.. కేబినెట్ ఎట్ల పని చేస్తదో తెలియదు. రైతుల ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలు ముఖ్యం ఆయనకు. విచారణల పేరిట రేవంత్ రాక్షసానందం పొందుతున్నారు. నిజం నిలకడగా తేలుతుంది. కొన్ని రోజులు కాళేశ్వరం అని, ఫోన్ ట్యాపింగ్ అని, ఈ ఫార్ములా అని డ్రామాలు ఆడుతున్నారు. మంత్రి వర్గ విస్తరణ చేయలేని సీఎం..చివరకు శాఖలు కేటాయించు కోలేని అసమర్థ సీఎం రేవంత్ రెడ్డి అని కేటీఆర్ ధ్వజమెత్తారు.

తెలంగాణను తెచ్చింది కేసీఆర్ నాయకత్వం.. తెలంగాణను సస్యశ్యామలం చేసింది కాళేశ్వరం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ-ఆర్ పేర్కొన్నారు. కేసీఆర్‌ను కమిషన్ ముందు నుంచో బెడితే నీకు పైశాచిక ఆనందం వస్తుంది కానీ.. ఆయన ఖ్యాతి ఇసుమంత కూడా తగ్గదు అని కేటీఆర్ అన్నారు. ఆయన ఎప్పటికీ తెలంగాణ కోసం ప్రాణాన్ని పణంగా పెట్టిన ధీరుడే.. మీరంతా సూర్యుడిని అరచేత్తో ఆపాలనుకునే మూర్ఖులే! అని మండిపడ్డారు. బ్యాగులు మోసే మీకు భగీరథ ప్రయత్నాలు అర్థం కావడానికి ఎన్ని జన్మలైనా సరిపోవు. తెలంగాణ కన్నీళ్లు తుడిచిన కాళేశ్వరాన్ని అర్థం చేసుకోవడానికి మీ తెలివి సరిపోదు! ఎప్పటికీ చరిత్రలో నిలిచిపోయే వాస్తవం.. తెలంగాణని తెచ్చింది కేసీఆర్ నాయకత్వం.. తెలంగాణను సస్యశ్యామలం చేసింది కాళేశ్వరం! అని కేటీ-ఆర్ స్పష్టం చేశారు. చివరకు జై కేసీఆర్.. జై తెలంగాణ అని కేటీఆర్ నినదించారు. ఈ సందర్భంగా కెటిఆర్ వెంట బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అనేకులు ఉన్నారు.

# బడిగంటలు మోగే వేళ.. సమస్యల గుదిబండ !




నేటినుంచి బడగంటలు మోగనున్నాయి. పాతవాసనలే ఇంకా గుప్పుమంటున్నాయి. అనేక సమస్యలు ఉన్నా కనీస సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయి. కిలో రూపాయి బియ్యం, పెన్షన్ల పంపిణీల మీదున్న శ్రద్ధ..పాఠశాలలను బాగుచేసే విషయంలో మాత్రం కానరావడం లేదు. ఈ క్రమంలో గతేడాదికి నేటికి ఏమైనా మార్పులు గోచరించాయా లేదా అన్నది స్కూళ్లకు వెళ్లే టీచర్లను, పిల్లలను అడిగితేనే తెలుస్తుంది. అయితే పాలకుల ప్రకటనల్లో ఉన్న శ్రద్ధ కార్యాచరణలో మాత్రం లేదనే చెప్పాలి. ప్రభుత్వ బడులు బాగా పడ్డాయంటే ప్రైవేట్ స్కూళ్లకు గిరాకీ తగ్గాలి. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ స్కూళ్లకు ఉత్సాహంగా పంపుతున్నారా లేదా అన్నది చూడాలి. దేశ భవిష్యత్ అంతా స్కూళ్లలోనే ఉంది. అవి బాగుపడితేనే దేశం బాగుపడుతుందన్న విషయంలో పాలకులకు పట్టడం లేదు. తెలుగు రాష్ట్రాల్లో ఏర్పడ్డ ప్రభుత్వాలు ఏడాది పూర్తి చేసుకున్నాయి. ఈ యేడాదిలో తము ఏమైనా మార్పు చేసామా లేదా అన్నది వారే చెప్పాలి. వేసవి సెలవులు తరవాత గురువారం పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో స్కూళ్లపై శ్రద్ధ పెడతారా అని తల్లిదండ్రులు ఆశగా చూస్తున్నారు.

12నుంచి స్కూళ్లు ప్రారంభం కాబోతున్నాయి. ప్రైవేట్ స్కూళ్లను పలుచోట్ల ఇప్పటికే ప్రారంభించారు. ఫీజులను ముందే వసూలు చేసుకుంటున్నారు. కొన్ని స్కూళ్లు ఫీజులను వసూలు చేశాక మెల్లగా నెలాఖరు వరకు ఆన్‌లైన్ క్లాసులంటూ విద్యార్థుల తల్లిదండ్రుకు చెప్పారు. బడిబాట పేరుతో ఆర్భాటాలు చేస్తున్న ప్రభుత్వాలు ప్రైవేట్ స్కూళ్ల పై నియంత్రణ కోల్పోయాయి. బడిబాటను మొక్కుబడిగా గాకుండా పక్కాగా నిర్వహించి, పిల్లలను ప్రభుత్వ స్కూళ్లలో చేర్పించేలా తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వాలి. ప్రైవేట్ యాజమాన్యాలు ఇచ్చే ఆమ్యామ్యాలే వారికి ముఖ్యం కనుక అధికారులు కార్పోరేట్లపై ఈగ వాలకుండా చూసుకుంటున్నారు. నిజానికి వారు చట్టం పరిధిలో ఉన్నారా అన్న అనుమానాలు కూడా కలగమానదు. ఇక సర్కార్ బళ్లల్లో ఉపాధ్యాయుల కొరత, పదోన్నతులు వంటి సమస్యలు ఏటా ఉండనే ఉంటున్నాయి. ఈ దశలో విద్యారంగం పటిష్టత కోసం ప్రభుత్వాలు నడుంబిగించాలి. కేంద్రం కూడా విద్యారంగానికి ఉదారంగా కేటాయింపులు పెంచాలి. ప్రభుత్వ పాఠశాలల బలోపేతంతోనే కార్పోరేట్ స్కూల్లకు కళ్లెం వేయగలం. తామంతా సర్కార్ బడుల్లోనే చదివామని, స్కూళ్లను ఆధునీ కరిస్తామని, డిఎస్సీతో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి చేసిన ప్రకటన కొంత ఊరటనిచ్చేదిగా ఉన్నా, ఆచరణలో మాత్రం ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నచందంగా ఉంది. ఎపిలో కూడా విద్యాశాఖ మంత్రి లోకేశ్ కూడా పాఠశాలల బలోపేతానికి అనేక హామీలు ఇచ్చారు. తెలంగాణలో పాఠశాలల ఆధునీకరణకు 2వేల కోట్లు కేటాయిస్తామని సిఎం అన్నారు. గతంలో ఎపిలో ఆంగ్ల మాధ్యమం పేరుతో, నాడునేడుతో జగన్ హడావిడి చేసినా.. క్షేత్రస్థాయి లో పరిస్థితుల్లో పెద్దగా మార్పు రాలేదు. ఈ క్రమంలో దశలవారీగా స్కూళ్లను ఆధునీకరించాలి. మౌళిక వసతులు కల్పించాలి. విద్యపై పెట్టుబడి దేశ సంపద అన్న సిఎం రేవంత్ మాటను నిలబెట్టుకుని చిత్తశుద్ధితో పని చేయాలి. పాఠశాల విద్యను ఎంతగా బలోపేతం చేస్తే సమాజం అంతగా బలోపేతం అవుతుంది. మంచి సమాజాం ఏర్పడడానికి పునాది పడుతుంది. విద్యకు ఎన్నివేల కోట్లు ఖర్చు చేసినా.. అది భవిష్యత్ పెట్టుబడిగానే చూడాలి. అనవసర పథకాలకు దుబారా చేసేకన్నా విద్య,వైద్యంపై శ్రద్ధ పెట్టి నిధులు కేటయిస్తే మంచిది. ఇలా చేయడం కోసం ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు కృషి చేయాలి. ఆరోగ్యశ్రీ పేరుతో కార్పోరేట్ స్కూళ్లకు వందలకోట్లు తగలెయ్యడం మానకుకోవచ్చు ప్రాథమికి ఆరోగ్య కేంద్రాలను, స్కూళ్లను బలోపేతం చేసేందుకు అడుగులు వేస్తేనే మంచిది. దీంతో కార్పోరేట్ స్కూళ్ల దోపిడీ నుంచి తల్లిదండ్రులు బయటపడగలరు. కార్పోరేట్ స్కూళ్లు ముక్కుపిండి లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నా నియంత్రణ లేకుండా పోయింది. ఏ అధికారి కూడా వారివైపు కన్నెత్తి చూడడం లేదు. లక్షల్లో ఫీజులు వసూళ్లు చేస్తున్నా..అడపాదడపా తల్లిదండ్రులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వాలు కిమ్మనకుండా ఉన్నాయి. కెజి టూ పిజి ఉచిత విద్యను అందించడానికి ప్రయత్నాలు సాగాలి. అలాగే పుస్తకాల ముద్రణ ఇంకా కొలిక్కి రాలేదు. ఉపాధ్యాయులు లేక నేటికీ తెరవని పాఠశాలలు కోకొల్లలు. తెలంగాణలో గత కెసిఆర్ ప్రభుత్వ నిర్వాకం వల్ల వేలాది స్కూళ్లు మూతపడ్డాయి. గిరిజన ప్రాంతంలో ఉపాధ్యాయులు లేక అనేక స్కూళ్లు మూతపడి వున్నాయి. గిరిజన గ్రామాలకు నేటికీ రవాణా సౌకర్యం లేదు. కొన్నిచోట్ల ఉన్నత పాఠశాలలో ఇంగ్లీషు, లెక్కలు, భౌతిక శాస్త్రం, సామాన్య శాస్త్రాలకు సబ్జెక్టు టీచర్లు లేరు. కొన్ని వేల స్కూళ్లు 5 తరగతులకు కలిపి ఒకే ఒక్క ఉపాధ్యాయుడితో నడుస్తున్నాయి. విద్యలో తెలుగు రాష్ట్రాలు వెనకబడి పోవడానికి సరైన దృక్పథం, చిత్తశుద్ధి లేకపోవడంగానే చూడాలి. ప్రభుత్వాల బాధ్యతా రాహిత్యం కారణంగా విద్యారంగం కుదేలవు తోంది. దేశవ్యాప్తంగా ఇదే దుస్థితి నెలకొంది. పిల్లలందరికి విద్యను చేరువ చేసే కార్యక్రమం జరగాలి. ఏ ఒక్క పిల్లవాడు బడిబయట లేకుండా చేయాలి. రాష్ట్ర ప్రజల అభివృద్ధికి, వికాసానికి సంబంధించిన ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకునే ముందు సంబంధిత పరిశోధనలు పరిగణలోకి తీసుకోవాలి. విద్యలో దేశంలోనే కేరళ ముందున్నది. అది కూడా మాతృభాష లోనే ప్రాథమిక విద్యను అందిస్తున్నది. కేరళ ప్రజలే ఎక్కువగా విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. మాతృభాషలో బోధన చేస్తూనే ఇంగ్లీష్, హిందీ భాషలు నేర్పితే సరిపోతుంది. ముందుగా ప్రతి ఒక్కరికి చదువు అన్నది నినాదంగా..దేశంలో జాతీయో ద్యమంగా సాగాలి. అలాగే ప్రైవేట్ స్కూళ్లపై అజమాయిషీ చేయాలి. డబ్బులు గుంజే విధానాన్ని అరికట్టాలి. వారు చట్టానికి లోబడి ఉండేలా చూడాలి. అంతేగాని వారిని పట్టించుకోకుండా.. వసూళ్లు చేసుకునేలా ప్రోత్సహించడం అరాచకం తప్ప మరోటికాదు. ఫీజుల నియంత్రణపై వేసిన కమిటీలు ఇచ్చిన సూచనలు బుట్టదాఖలు చేయడం ఎంతవరకు సమంజసమో ఆలోచించాలి. సర్కార్ బడులను నిజగానే బలోపేతం చేసి, బోధనా సిబ్బందిని నియమించి, మౌళిక వసతులు కల్పిస్తే ప్రజలు తప్పకుండా సర్కార్ బడులనే ఆశ్రయిస్తారు. విద్యారంగానికి పూర్వ వైభవం కూడా వస్తుంది.

# మంగ్లీ బర్త్‌డే పార్టీలో విదేశీ మద్యం, గంజాయి

రంగారెడ్డి:సింగర్ మంగ్లీ బర్త్‌డే పార్టీలో విదేశీ మద్యం, గంజాయి లభ్యమయ్యాయి. పుట్టినరోజు సందర్భంగా రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఈర్లపల్లి శివారులోని రిసార్టులో స్నేహితులకు మంగళవారం రాత్రి ఆమె పార్టీ ఇచ్చారు. ఈ వేడుకలకు సుమారు 50 మంది వరకు మంగ్లీ కుటుంబ సభ్యులు, స్నేహితులు హాజరయ్యారు. వీరిలో సినీ పరిశ్రమకు చెందిన వారు కూడా ఉన్నట్లు సమాచారం. ఈక్రమంలో రాత్రి 2 గంటల సమయంలో ఎస్‌వోటీ పోలీసులు రిసార్టుపై దాడులు చేశారు. పార్టీకి వచ్చిన వారిలో 48 మందికి గంజాయి పరీక్షలు నిర్వహించగా 9 మందికి పాజిటివ్ వచ్చినట్లు అధికారులు తెలిపారు. దీంతో వారిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ క్రమంలో సింగర్ మంగ్లీపై కేసు నమోదు అయింది. అనుమతి లేకుండా బర్త్‌డే పార్టీ నిర్వహించిన కారణంతో పోలీసులు ఆమెపై కేసు నమోదు చేశారు. మంగ్లీ తన పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం రాత్రి చేవెళ్ల త్రిపుర రిసార్ట్‌లో తన స్నేహితులకు పార్టీ ఇచ్చారు. ఈ పార్టీకి చిత్ర పరిశ్రమకు చెందిన పలువురు సెలెబ్రిటీలు కూడా వెళ్లారు. దివి, కాసర్ల శ్యామ్, రచ్చ రవి, సింగర్ ఇంద్రావతి పార్టీలో పాల్గొన్నారు. ఈ క్రమంలో పోలీసులు రిసార్ట్‌పై దాడులు నిర్వహించారు. దామోదర్ అనే వ్యక్తి గంజాయి తీసుకుంటూ పట్టుబడ్డాడు. పోలీసులు అతడ్ని అదుపులోకి తీసుకున్నారు. విదేశీ మద్యాన్ని సైతం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనుమతి లేకుండా డీజే ప్లే చేసినందుకు డీజేను సీజ్ చేశారు. అనుమతి లేకుండా బర్త్ డే పార్టీ నిర్వహించినందుకు మంగ్లీపై పోలీసులు కేసు నమోదు చేశారు. మంగ్లీతో పాటు త్రిపుర రిసార్ట్ జీఎం శివరామకృష్ణపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు.

# దేశంలో 7వేలకు పైగా కోవిడ్ కేసులు




న్యూఢిల్లీ::దేశ వ్యాప్తంగా కోవిడ్ కేసులు అమాంతంగా పెరిగిపోయాయి. పదుల్లో ఉండే కేసులు ఇప్పుడు వేలల్లోకి వచ్చేశాయి. అన్ని రాష్ట్రాల్లోకరోనా కేసులు పెరిగిపోయాయి. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 7 వేలకు పైగా కోవిడ్ కేసులు నమోదయ్యాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య శాఖ సూచించింది. ఈ నేపథ్యంలో ప్రధాన మంత్రి కార్యాలయం కూడా అప్రమత్తం అయింది. ఇకపై ప్రధాని మోడీని కలిసే మంత్రులు, ప్రభుత్వ శాఖ అధికారులు, ఇతర ప్రముఖులు తప్పనిసరిగా ఆర్టీపీసీఆర్ పరీక్ష చేయించుకోవాలని పీఎంవో సూచించినట్లు- అధికారిక వర్గాలు తెలిపాయి. భారత్ లో కోవిడ్ కేసుల సంఖ్య పెరుగుతోంది. కేసుల సంఖ్య 6,815 కు చేరుకుందని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. గత 24 గంటల్లో కొత్తగా 324 మందికి ఈ వ్యాధి సోకింది. చికిత్స పొందుతూ ముగ్గురు మరణించారు. మరో 783 మంది కోలుకున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి దేశంలో 68 మరణాలు నమోదయ్యాయని పేర్కొంది. దేశంలో కోవిడ్ యొక్క కొత్త వేరియంట్ కూడా వ్యాప్తి చెందుతున్నట్లు- కనుగొనబడింది. దేశ వ్యాప్తంగా 163 మంది సోకిన వారిలో కొత్త ఓమిక్రాన్ వేరియంట్ ఎక్స్ఎఫ్ జి ఉనికిని కనుగొన్నట్లు- ఇండియన్ జెనోమిక్స్ కన్సార్టియం ప్రకటించింది. గతంలో జెఎన్1 , ఎల్ఎఫ్7 మరియు ఎక్స్ఎఫ్ జి వంటి ఓమిక్రాన్ వేరియంట్‌లు భారతదేశంలో వ్యాపిస్తున్నాయని ఐసిఎంఆర్ నిర్ధారించింది. కేరళలో 96 కొత్త కేసులు నమోదు కావడంతో మొత్తం సోకిన వారి సంఖ్య 2,053కు చేరుకుంది. పీఎంవో సూచన మేరకు బుధవారం సాయంత్రం ప్రధాని మోడీని కలవనున్న ఢిల్లీ ముఖ్యమంత్రి, ఏడుగురు ఎంపీలు, ఎమ్మెల్యేలతో సహా ఢిల్లీకి చెందిన దాదాపు 70 మంది బీజేపీ కార్యకర్తలు ఆర్టీ-పీసీఆర్ పరీక్ష చేయించుకోనున్నట్లు వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించిన తర్వాత ప్రధాని మోడీ అన్ని రాష్ట్రాల పార్టీ నాయకులకు రాత్రి 7:30 గంటలకు విందు ఇవ్వనున్నారు. ఈ నేపథ్యంలో అందరూ కూడా కోవిడ్ టెస్ట్ చేయించుకున్నట్లు- సమాచారం. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ బుధవారం విడుదల చేసిన లెక్కల ప్రకారం.. గత 24 గంటల్లో దేశంలో 306 కొత్త కేసులు నమోదవడంతో పాటు- ప్రస్తుతం యాక్టివ్ కేసుల సంఖ్య 7,121లకు చేరింది. దేశంలో కొవిడ్ మృతుల సంఖ్య 74కు పెరిగింది. కేరళలో అత్యధికంగా 2,223 యాక్టివ్ కేసులు ఉండగా.. గుజరాత్, ఢిల్లీ, పశ్చిమబెంగాల్ తర్వాతి స్థానాల్లో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

# ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల మోత



**నిజామాబాద్:** జూన్ అంటేనే మధ్య తరగతి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఈ నెలలోనే విద్యాసంస్థలు ప్రారంభమవుతాయి.ఈ నెల 12 నుంచి కొత్తవిద్యాసంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో పిల్లల చదువుకు పెట్టే ఖర్చులపై తల్లిదండ్రులు బేరీజు వేసుకుంటున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఇప్పటికే ఫీజుల వసూల్లు, పుస్తకాల కొనుగోళ్లు పూర్తయ్యాయి. డ్రెస్సులు, షూస్ వంటి కొనుగోళ్లు కూడా ముందే కానిచ్చేశారు. ప్రైవేట్ స్కూళ్లకు పిల్లలను పంపే తల్లిదండ్రులు ఇప్పటికే పిల్లలకు బడ్జెట్ కేటాయించుకోవాల్సి వచ్చింది. కొత్తగా అడ్మిషన్ తీసుకునేవారు ప్రైవేటు విద్యాసంస్థలు వసూలు చేస్తున్న అడ్మిషన్, డొనేషన్ ఫీజులు చూసి జంకుతున్నారు. ఇదివరకే చదువుతున్న విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం తదితర వస్తువుల కొనుగోలుతో తల్లిదండ్రులకు జేబులకు చిల్లుపడ నుంది. దీంతో 'వామ్మో జూన్' అంటూ తలపట్టు కుంటున్నారు. ఒక వైపు తమ పిల్లలను ఏ

పాఠశాలలో చేర్పించాలి, ఏయే స్కూల్‌లో ఏ స్థాయి ఫలితాలు వచ్చాయి, తదితర అంశాలపై తల్లిదండ్రులు విశ్లేషించుకోవడం కూడా పూర్తయ్యింది. జిల్లాలోని ప్రైవేట్ స్కూళ్లు, కళాశాలల్లో ఫీజులు చుక్కలనంటుతున్నాయి. బుక్స్, యూనిఫాం, పెన్నులు, పెన్సిల్ ఇతరాత్ర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. పేద, మధ్య తరగతి కుటంబీకుల జేబులకు చిల్లుపడే మాసం వచ్చేసింది. జిల్లావ్యాప్తంగా సుమారు 600 పైగా ప్రైవేట్ పాఠశాలల్లో వాటి విద్యాప్రమాణాలు, ఇతర అంశాలతో కూడిన స్థాయిని బట్టి ఏడాదికి రూ.10 వేల నుంచి మొదలుకొని రూ.లక్షకు పైగా ఫీజులున్నాయి. అందులోనూ ఐఐటీ, ట్యూషన్, సాంస్కృతిక, కరాటే తదితర అంశాలు నేర్పించేందుకు అదనంగా రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు ప్రైవేట్ స్కూళ్లు వసూలు చేస్తున్నాయి. వీటిలో కొన్ని తోకల పేరుతో 1వ తరగతికే రూ.లక్షల్లో వసూలు చేయడం విశేషం. కొన్ని పాఠశాలలైతే నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. అప్పు చేసైనా ప్రైవేట్ స్కూల్ అనేది వేళ్లూనుకోవడంతో దిగువ, మధ్య తరగతి జనం కూడబెట్టుకున్న దానికి మరికొంత అప్పు చేసి పిల్లలను కార్పొరేట్ స్కూళ్లలో చేర్పిస్తున్నారు. మరోవైపు వానాకాలం సీజన్ మొదలవ్వడంతో రైతులు పెట్టుబడుల కోసం తిప్పలు పడుతున్నారు. విత్తనాలు, ఇతర ఖర్చులకు డబ్బుల

కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తూనే బ్యాంకర్ల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. దీంతో ఈనెల ఎలా గట్టెక్కుతుందా అని ప్రజలు ఆందోళన చెందు తున్నారు. ఏటా రైతులకు వానాకాలం సీజన్ భారంగా మారుతోంది. ఈ యాసంగి పంటలు పండినా ధాన్యం డబ్బు చేతికి రాని దైన్య స్థితిలో రైతులు ఉ న్నారు. వ్యవసాయ పనులూ అంతంతే. ఇతరత్రా కూలీ పనులు దొరక్క గ్రామీణుల్దు ఉపాధి పనులకు వెళ్లినా కొద్ది రోజులుగా డబ్బులు అందక వారి పరిస్థితి గందరగోళంగా ఉంది. మండుతున్న ఎండల్లో ఉపాధి పనులకు వెళ్తే రూ.200 నుంచి రూ. 250 వరకు దక్కడం లేదు. ఈ పరిస్థితుల్లో ఖరీ ఫ్‌నకు సంబంధించి ఎరువులు, విత్తనాల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకుల్లో సరిపడా రుణాలు లభించక అప్పు చేయక తప్పని పరిస్థితి నెలకొంది.

# భూ సమస్యల పై వచ్చిన ప్రతి దరఖాస్తు పరిష్కారానికి కృషి చెయ్యాలని జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి అన్నారు



సిద్దిపేట ప్రతినిధి, ఉదయం న్యూస్

బుదవారం కొమురవెల్లి మండలం లోని కిష్టం పేట గ్రామపంచాయతీ లో నూతన అర్ ఓ అర్ చట్టం - భూ భారతి రెవెన్యూ అవగాహన సదస్సులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.
రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను త్వరగా ఫీల్డ్ విచారణ పూర్తి చేసే పరిష్కరించాలని అన్నారు. వచ్చిన దరఖాస్తులలో విచారణ పూర్తయిన వాటిని వెంటనే ఆన్ లైన్ లో నమోదు చేయాలని అన్నారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన ప్రతి దరఖాస్తుకు వాటి పూర్తి వివరాలు తీసుకోవాలని, భూ భారతి చట్ట ప్రకారం వాటి పరిష్కారానికి పకడ్బందీ చర్యలు చేపట్టాలని అన్నారు.
ఈ కార్యక్రమంలో తహసిల్దార్ దివ్య సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల పరిపూర్ణ మానసిక వికాసానికి అంగన్వాడీలో చేర్పించండి:జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ ప్రతినిధి, ఉదయం న్యూస్



పిల్లల పరిపూర్ణ మానసిక వికాసానికి శారీరక ఎదుగుదలకు అంగన్వాడీలో చేర్పించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు.
రాష్ట్రవ్యాప్తంగా బుధవారం నుండి అంగన్వాడీ కేంద్రాలు పున: ప్రారంభమైన నేపథ్యంలో నగరంలోని కారా?నా గడ్డ అంగన్వాడి కేంద్రంలో ప్రారంభ వేడుకలుపండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. కొత్తగా అంగన్వాడిలో చేరిన పిల్లల తల్లిదండ్రులను కేంద్రాలకు ఆహ్వానించారు. చిన్నారుల సందడిలో వేడుకలు ఘనంగా జరిగాయి.
ఈ వేడుకలకు హాజరైన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ. 3 నుండి ఆరేండ్ల లోపు పిల్లందరినీ అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని అన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ కు ధీటుగా అంగన్వాడీ కేంద్రాల్లో ఆట పాటలతో కూడిన విద్య అందిస్తారని తెలిపారు. నూతన సిలబస్ తో సమగ్ర శిక్షణ పొందిన టీచర్లు బోధిస్తున్నారని అన్నారు. ప్రతి రోజూ పోషకాలతో కూడిన ఆహారం అందించడంతో పాటు పిల్లల వయస్సుకు తగిన ఎత్తు, బరువుతో ఉండేలా చూస్తారని, ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహిస్తారని తెలిపారు. ఈ నెల 17 వరకు అమ్మ మాట అంగన్వాడీ బాట కార్యక్రమం ద్వారా అంగన్వాడీ కేంద్రాల్లో ఎక్కువ మంది చేరేలా చూడాలని ఐసిడిఎస్ సిబ్బందికి సూచించారు.
అంగన్వాడీ పునః ప్రారంభం సందర్భంగా పిల్లలకు కోడిగుడ్డు బిర్యానీ సిద్ధం చేయగా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ చేతుల మీదుగా పిల్లలకు వడ్డించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, సీడీపీఓ సబిత పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు చేయకూడదు గ్రామ సర్పంచ్ మొగతాల్ అరుణ్ కుమార్

ఉదయం న్యూస్: దేవనకొండ జూన్ 11



మండలం పరిధిలోని తెర్నేకల్ గ్రామం లోకిషోర వికాసం ప్రోగ్రాం నిర్వహించారు
ఆస్పరి ప్రాజెక్టు తెర్నేకల్ సెక్టార్ తెర్నేకల్ గ్రామం లో అంగన్వాడీ సెంటర్ నందు గ్రామ సర్పంచ్ శ్రీ మొగతాల్ అరుణ్ కుమార్ గారి ఆధ్వర్యంలో లో కిషోర వికాసం గూర్చి అంటే బాల్య వివాహాలు చేయకుండా, 18 సంవత్సరాలు నిండిన తరువాత నే పెళ్లిళ్లు చేసుకోవాలి అని, ఒకే ఇంట్లో ఉన్న కొడుకు కూతురు పట్ల లింగ వివక్షత చూపకూడదు అని, బాలల హక్కులు బాలల చట్టాలు గురించి పిల్లల తల్లిదండ్రులు కు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో అంగన్వాడీ టీచర్లు,హెల్పర్స్ పాల్గున్నారు.

# అక్షరాలు దిద్దించిన దానధర్మ చారిటబుల్ ట్రస్ట్



ఉదయం న్యూస్ శిరివెళ్ల

నాగ మల్లేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసానికి విశేష స్పందన.మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో గల శ్రీ వీరభద్ర చెన్నకేశవ శివాలయంలో దానధర్మా చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం అత్యంత ఆధ్యాత్మిక వైభవంగా బుదవారం నాడు నిర్వహించారు. వేద పండితులు అర్చకులు గ్రామ పెద్దలు స్త్రీ శిశు సంక్షేమ శాఖ గ్రామీణ సిబ్బంది మహిళా పోలీసులు తదితరుల ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమానికి చిన్నారులు సుమారు 60 మంది హాజరయ్యారు.అభం శుభం తెలియని అక్షరాలు నేర్పించుకోవాలన్న సదుద్దేశంతో తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు తమ చిన్నారులను సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమానికి తీసుకొని వచ్చి ఆధ్యాత్మిక వైభవంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు.హిందూ ధర్మంతగ్గి నైతిక విలువలు అంతరించిపోతూ ఆధ్యాత్మికతను మరిచిపోతున్న నేటి సమాజంలో దానధర్మా చారిటబుల్ ట్రస్ట్ వారు నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలను శిరివెళ్ల మండలం కోటపాడు గ్రామంలో దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ మండల ధర్మ ప్రచారక్ అన్నెం నాగమల్లేశ్వర రెడ్డి నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమానికి విశేష స్పందన లభించింది.తమ చిన్నారులు విద్యాబుద్ధులు నేర్చుకొని ప్రయోజకులు కావాలని దేశం గర్వించదగ్గ పౌరులుగా ఎదగాలని జీవితాంతం మంచి తెలివితేటలతో జ్ఞానోదయంతో ఉత్తమ పౌరులుగా వర్ధిల్లాలని అర్చకులు ప్రసాద శర్మ ఆశీర్వదించారు.సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో దానధర్మా చారిటబుల్ ట్రస్ట్ వారి సహకారంతో అన్నెం నాగమల్లేశ్వరరెడ్డి చిన్నారులకు పలకలు బలపాలు ఇతర విద్యా సామాగ్రి అందించి అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆంగ్ల మాద్యమంలో విద్యాబోధన జరూపుతూనప్పటికీ దేశ సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు అందించడం అభినందనీయమన్నారు. సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో చదువుల తల్లి సరస్వతీ దేవికి విశేష పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డిష్ గోపాల్, రామసుబ్బారెడ్డి, రమణ, సుబ్బరాయుడు స్వామి, అన్నెం సుధాకర్ రెడ్డి, అన్నెం నాగేశ్వర్ రెడ్డి, పూజారి ప్రసాద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదంలో స్వేచ్ఛా ప్రజాస్వామ్యం

ఉదయం న్యూస్ వనపర్తి.




టి డబ్ల్యూ జె ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య ప్రశ్నార్థకంగా మారిన జర్నలిస్టుల ఐక్యత టి డబ్ల్యూ జేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ కృష్ణ విజయవంతంగా ముగిసిన జిల్లా మూడవ మహాసభలు దేశంలో, రాష్ట్రంలో జర్నలిస్టుల స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతోందని, అందులోనూ జర్నలిస్టుల ఐక్యత ప్రశ్నార్థకంగా మారుతోందని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ కృష్ణ అన్నారు.
వనపర్తి జిల్లా కేంద్రంలోని స్థానిక టీఎన్జీవో సమావేశ భవనంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా మూడవ మహాసభలు అక్రిడిటేషన్ కమిటీ మెంబర్ అశోక్ అధ్యక్షతన మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బసవపున్నయ్య, తాటికొండ కృష్ణ మాట్లాడుతూ గత ఏపీడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టుల సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడంతో ఏపీడబ్ల్యూజేఎఫ్ ఏర్పడిందని గుర్తు చేశారు. సంఘం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు అక్రిడిటేషన్లు, హెల్త్ కార్డులు, జర్నలిస్టులకు ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు, సంక్షేమ పథకాల కోసం ఎన్నో పోరాటాలు చేశామని తెలిపారు. గతంలో పనిచేసిన, ప్రస్తుతం కొనసాగుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జర్నలిస్టుల సమస్యలను పట్టించుకోకపోవడం దుర్మార్గమని, జర్నలిస్టుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎంతోమంది జర్నలిస్టులు పాతిక, 30 సంవత్సరాలకు పైగా పని చేసినా నేటికీ ఇందిరమ్మ ఇండ్లు గాని, ఇండ్ల స్థలాలు గాని కేటాయించకపోవడం అన్యాయమన్నారు. సామాన్యులకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తూ ప్రభుత్వానికి అనుసంధానంగా పనిచేస్తున్న జర్నలిస్టులకు ప్రత్యేక సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత కొన్నేళ్లుగా జర్నలిస్టులపై అధికార, విపక్ష నాయకులు దాడులకు పాల్పడటం విచారకరమని తెలిపారు. ప్రజల సంక్షేమం కోరే జర్నలిస్టు మిత్రులు వారి కుటుంబాల యోగక్షేమాలను పట్టించుకోవాల్సిన అవసరం కూడా ఉందని గుర్తు చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమాన్ని ముందిండి నడిపించిన జర్నలిస్టులకు గత సీఎం కేసీఆర్ ఏమాత్రం న్యాయం చేయలేకపో యారని ఘాటుగా విమర్శించారు. జర్నలిస్టులంతా పారదర్శకంగా, నీతి నిజాయితీగా ప్రజా సమస్యలపై గలమెత్తుతూ సామాన్యులకు న్యాయం చేసే విధంగా కథనాలను ప్రచురించాలని ఈ సందర్భంగా సూచించారు. జర్నలిస్టులను ఆయా సంస్థలు గుర్తించి వార్త కథనాలు రాయించుకుంటూ ఇచ్చే గుర్తింపు కార్డులను అధికార యంత్రాంగం పరిగణలోకి తీసుకోవాలని తెలిపారు. అక్రిడేషన్ కార్డుల కాల పరిమితి అయిపోయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం పొడిగించడం దారుణమని, ఇప్పటికైనా కొత్త అక్రిడిటేషన్ కార్డులను, రైల్వే పాసుల రాయితీని వెంటనే జర్నలిస్టులందరికీ ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో ఉన్న ప్రెస్ అకాడమీ జర్నలిస్టులను విచ్ఛిన్నం చేయకుండా, వివక్ష చూపకుండా ప్రతి జర్నలిస్టుకు శిక్షణ, నైపుణ్య తరగతులు నిర్వహించాలని వృత్తిపరమైన ఇబ్బందులు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం వంటి సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని అందుకోసం స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు బాధ్యత తీసుకోవాలని ఈ సందర్భంగా కోరారు.
ఉమ్మడి జిల్లాలో ఎక్కడా లేని అక్రిడేషన్ కార్డుల కంటే వనపర్తి జిల్లాలో జర్నలిస్టుల సంఖ్య అధికంగా ఉందని, ఈ జర్నలిస్టులంతా ఐక్యమత్యంగా సమస్యలపై పోరాడి సాధించుకోవాలని గుర్తు చేశారు. గత 30 ఏళ్ల క్రితమే వనపర్తి నియోజకవర్గ పరిధిలోని పెబ్బేరు మండల కేంద్రంలో ప్రెస్ క్లబ్ ఏర్పడి ఐక్యంగా ఉండి దాదాపు 50 మంది విలేకరులు ఇండ్ల స్థలాలు, ఇండ్లను సాధించుకున్నారని, ఈ సందర్భంగా వారిని అభినందిస్తున్నామని తెలిపారు. సుదీర్ఘకాలంగా జర్నలిస్టుల సమస్యలు పెండింగ్లో ఉంటున్నాయని వాటిపైన ఐక్యంగా పోరాడేందుకు కనీసం వందమంది కలిసి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులు ఉమ్మడిగా ఉంటూ ఐక్యంగా సమస్యల సాధన కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. ఈడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో ఉమ్మడి కార్యాచరణ రూపొందించుకొని కార్యాచరణ అమలు కోసం కలసికట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్య వర్గ సభ్యులు రామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు మాణిక్ ప్రభు, రాష్ట్ర కమిటీ సభ్యులు పరిపూర్ణం, నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు రామచందర్, సీనియర్ జర్నలిస్టులు రమేష్, పూరి సురేష్ శెట్టి, పత్రికల విలేకరులు, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు తదితరులు పాల్గొన్నారు.

టిడబ్ల్యూజేఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక
తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ( టిడబ్ల్యూజేఎఫ్ ) వనపర్తి జిల్లా నూతన కార్యవర్గాన్ని మహాసభల సందర్భంగా రాష్ట్ర నాయకుల సమక్షంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా జూటూరు రాము (నవతెలంగాణ), కార్యదర్శి గా అక్కల శ్రీనివాస్ గౌడ్ ( మెట్రో ఈవినింగ్), ఉపాధ్యక్షులుగా కే సురేందర్ గౌడ్ ( మాటీవీ), పెరుమళ్ళ వెంకటేశ్వర్లు (సత్యవార్త ), పొర్ల రవీందర్ గౌడ్ ( ఆంధ్రజ్యోతి), సహాయ కార్యదర్శులుగా చారగొండ బాబు (ప్రజా సాక్షి), బక్కి బాబు (నవతెలంగాణ), ఎన్ నాగభూషణం ( తెలుగు సత్తా), కోశాధికారిగా పి శ్రీనివాసులు (సత్యవార్త), ఆర్గనైజేషన్ కార్యదర్శిగా పోతులపల్లి వెంకటేష్ ( మెట్రో ఈవినింగ్ ), ఈసీ మెంబర్లుగా పెబ్బేటి రాము (టీవీ 6), పోతుగంటి విష్ణు ( అభినయ), ఆత్మకూర్ గోపాల్ (మెట్రో ఈవినింగ్ ), గుంటి విష్ణువర్ధన్ (రాజముద్ర ), కే వెంకటేష్ నాయక్ ( సత్య వార్త), జి రవికుమార్ చారి (ఉదయం), మన్మోహన్ ( నవతెలంగాణ ), బాలకృష్ణ (మెట్రో ఈవినింగ్), పెద్దిగారి రంజిత్ ( పీపుల్స్ మోటివేషన్) లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్టేట్ కౌన్సిల్ మెంబర్ గా పెద్దిగారి స్వామి (సత్యవార్త), జాతీయ కౌన్సిల్ మెంబర్లుగా పూరి సురేష్ శెట్టి (మన తెలంగాణ), ఈనాడు రమేష్ (వాయిస్ ఆఫ్ వర్డ్స్), చిన్న పత్రికల అక్రిడిటేషన్ కమిటీ మెంబర్ గా వి అశోక్ కుమార్ ( సత్యవార్త) లను జిల్లా మహాసభ ఎన్నుకుంది.

# ఏపీలో 'విద్యార్థి మిత్ర కిట్'లు పంపిణీకు సిద్ధం...

ఉదయం న్యూస్




జూన్ 12వ తేదీ నుంచి పంపిణీ ఏపీలో ప్రభుత్వ స్కూళ్లు పునఃప్రారంభమయ్యే రోజునే ఈ నెల 12వ తేదీ నుంచే స్టూడెంట్లకు 'విద్యార్థి మిత్ర కిట్'లు అందించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నెల 20లోపు పంపిణీ పూర్తికావాలని హెచ్ఎమ్ లకు సూచించింది. దీంతో అధికారులు ఇప్పటికే మండలాలకు వస్తువులను చేరవేశారు. యూనిఫామ్, బెల్ట్, నోట్ బుక్స్, పాఠ్య పుస్తకాలు, వర్క్ బుక్స్, బ్యాగ్, బూట్లు, సాక్సులు, డిక్షనరీ కిట్లో ఉంటాయి. ఒక్కో కిట్కు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.2,279 ఖర్చు చేస్తోంది.

# పేదలకు నిరుద్యోగులకు అభివృద్ధి మార్గం వైపు

ఉదయం న్యూస్ ఆళ్లగడ్డ



ఆళ్లగడ్డ గౌరవనీయులైన డైనమిక్ లీడర్ ఆంధ్ర ఉక్కు మహిళ కాంగ్రెస్ పార్టీ పిసిసి అధ్యక్షురాలు అయిన వైయస్ షర్మిలా రెడ్డి గారు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లా పర్యటిస్తున్నారు రెండు వేల ఇరవై తొమ్మిదిలో రాష్ట్రంలో దేశంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలో తెచ్చుకోవాలి బడుగు బలహీన వర్గాలకు పేదలకు నిరుద్యోగులకు అభివృద్ధి మార్గం వైపు నడిపించాలని చైతన్య వంతులుగా తీర్చిదిద్దాలని గట్టి నిర్ణయం తీసుకున్నారు తండ్రికి తగ్గ తనయగా అలుపు లేని పోరాటం చేస్తా ఉన్నారు అదేవిధంగా మన నంద్యాల జిల్లాకు వస్తున్నారు కావున కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కాంగ్రెస్ పార్టీ అభిమానులు రాజా శేఖర్ రెడ్డి గారి అభిమానులు అందరూ మనము కలిసి ఆమె పోరాటంలో భాగస్వాములు ఐదాము ఆమె జిల్లా పర్యటన యాత్రను జయప్రదం చేద్దాము జైహింద్ జై కాంగ్రెస్ కార్యక్రమానికి వచ్చేవారు అందరూ 12 .6.2025 గురువారం ఉదయం ఏడు గంటలకు ఆళ్లగడ్డ కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ వద్దకు రావలసిందిగా కోరుచున్నాము నంద్యాలకు బయలుదేరుటకు వాహన సౌకర్యం చేసాము ఇట్లు మీ బార గో ఢ్ల హుస్సేన్ భాష ఆళ్లగడ్డ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్

# ఈరోజు బుధవారం శ్రీ భారతి విద్యా మందిరం రామాలయం వీధి ఆళ్లగడ్డ

ఉదయం న్యూస్ ఆళ్లగడ్డ



ఉదయం సరస్వతి పూజ, హొమము నిర్వహించాము, అధ్యక్షులు P.రామచంద్రారెడ్డి గారు, ఉపాధ్యక్షులుG.నరసింహ హరిప్రసాద్ దంపతులు, కార్యదర్శి Rసత్య ప్రసాద్ గారు, జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ గారు, %B% నీలకంఠేస్వరం గారు కోశాధి కారి B.పుల్లయ్య గారు ప్రధానాచార్యులు శ్రీమతి S.నిర్మల గారు, శ్రీమతి G.పద్మావతి గారు సభ్యులు C. ముని రామకృష్ణ గారు, G.రవిశంకర్ గారు, నాగరాజు, పాఠశాల మాతాజీలు పాల్గొన్నారు

# ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు జిల్లా( ఉదయం న్యూస్)




బుధవారం:-ఆస్పరిలో ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు రవి డిమాండ్ చేశారు
బుధవారం వారి ఏర్పాటు చేసుకున్న ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఆస్పరిలో విజేత స్కూల్ నారాయణ ప్రైమ్ స్కూల్ నోబుల్ స్కూల్ విద్యోత స్కూల్ ముందస్తు అడ్మిషన్ చేస్తూ తల్లిదండ్రులు మాయమాటలు చెప్పి వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నారని అటువంటి పాఠశాలలపై వెంటనే ప్రభుత్వాధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. వారి పాఠశాలల యొక్క కరపత్రాలతో ప్రతి గ్రామంలో తిరుగుతూ ముందస్తు అడ్మిషన్ చేయడం సరి కాదన్నారు ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమాలకు సిద్ధమవుతామని నాయకులు శ్రీకాంత్ నవీన్ తదితరులు పాల్గొనడం జరిగింది.

# కొలిమిగుండ్ల మండల తహసిల్దార్ గా శ్రీనివాసులు బాధ్యతలు చేపట్టారు...

కొలిమిగుండ్ల, జూన్ 11, (ఉదయం న్యూస్):



కొలిమిగుండ్ల మండల నూతన తహసిల్దార్ గా శ్రీనివాసులు బుధవారం నాడు బాధ్యతలు చేపట్టారు. తహసిల్దార్ కార్యాలయానికి చేరుకున్న శ్రీనివాసులుకు రెవెన్యూ సిబ్బంది పూలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం నూతన తహసిల్దార్ శ్రీనివాసులును ఆర్ఐ వరలక్ష్మి, భాస్కర్ రెడ్డి, నాగరాజు, వీఆర్వోలు ప్రసాద్ రెడ్డి, మోహన్, రామసుబ్బయ్య, ప్రభాకర్ కలిసి బుధవారం నాడు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన తహసిల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉండి రైతులు ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, వీఆర్వోలు సిబ్బంది పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేసిన వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి.

ఉదయం న్యూస్ వనపర్తి.




అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు అందుతుందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అన్నారుఈరోజు వనపర్తి జిల్లా కేంద్రంలోని వనపర్తి మున్సిపాలిటీ మరియు వనపర్తి మండలం లబ్ధిదారులకు పట్టణంలోని దాచ లక్ష్మయ్య ఫంక్షన్ హాల్ లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి పాల్గొని ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి మాట్లాడుతూగత పాలకులు పేద ప్రజల సమస్యలను పట్టించుకోలేదని ఈ ప్రజా పాలనలో పేద ప్రజల సమస్యలే పరిష్కారం దిశగా ముందుకు వెళుతుందని అన్నారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పేద ప్రజలకు ఇల్లా పట్టాల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.ఇల్లు నిర్మించిన అనంతరం ఇందిరమ్మ ఇళ్లలోనే మీ ఆహ్వానం మేరకు మన ప్రభుత్వం ఇచ్చే సన్న బియ్యంతో మీ ఇంట్లోనే భోజనం చేసి వస్తానని హామీ ఇచ్చారు.

# విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టులో బిగ్ అప్‌డేట్



విశాఖ: మెట్రో ప్రాజెక్టులో కీలక ముందడుగు పడింది. ఈ ఏడాది అక్టోబర్‌లో విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలోనే కీలక ముందడుగు పడింది. ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ అధికారులు, మెట్రో రైలు అధికారులు విశాఖలో పర్యటించారు. మెట్రో స్టేషన్లు ఏర్పాటు చేయాలని భావిస్తున్న ప్రాంతాలను పరిశీలించారు. మూడు కారిడార్లతో 42 స్టేషన్లతో విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని డీపీఆర్ రూపొందించిన సంగతి తెలిసిందే.

విశాఖపట్నం మెట్రో రైలు ప్రాజెక్టులో మరో కీలక అడుగు పడింది. విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టు కోసం నిర్దేశించిన ప్రాంతాలను ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ప్రతినిధులు, మెట్రో రైల్ అధికారులు సోమవారం పరిశీలించారు. అనంతరం.. ఏపీ మెట్రో రైలు కార్పొరేషన్ ఎండీ రామకృష్ణారెడ్డి విలేకర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టు గురించి కీలక వివరాలు వెల్లడించారు. విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టును 46.22 కి.మీ మేరకు నిర్మించనున్నట్లు తెలిపారు. విశాఖ మెట్రోలో మొత్తం 42 స్టేషన్లు ఉంటాయని వెల్లడించారు. విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టు మొదటి దశ కోసం రూ.11000 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నట్లు ఏపీ మెట్రో రైలు కార్పొరేషన్ ఎండీ రామకృష్ణారెడ్డి వెల్లడించారు. కొమ్మాది నుంచి కూర్మన్నపాలెం వరకూ.. మెట్రో స్టేషన్ల కోసం నిర్దేశించిన ప్రాంతాలను పరిశీలించినట్లు వెల్లడించారు.

మరోవైపు విశాఖ మెట్రో రైలు ప్రాజక్టు నిర్మాణ పనులను అక్టోబర్ నుంచి ప్రారంభించాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. ఏపీ పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఇదే విషయాన్ని ఇటీవల వెల్లడించారు. విశాఖ మెట్రో పనులను అక్టోబరులో ప్రారంభిస్తామని.. డబుల్ డెక్కర్ విధానంలో నిర్మించేలా డీపీఆర్ రూపొందించినట్లు నారాయణ ఇటీవల వివరించారు. మరోవైపు విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టుకు కన్సల్టెన్సీ నియామకం కోసం.. అమరావతి మెట్రో రైలు కార్పొరేషన్ ఏప్రిల్ నెలాఖరులో బిడ్లను కూడా ఆహ్వానించింది.

మరోవైపు విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టును మూడు కారిడార్లలో నిర్మించాలని డీపీఆర్ రూపొందించారు. మొదటి దశలో మూడు కారిడార్లలో ప్రాజెక్టు చేపట్టాలని నిర్ణయించారు. మొత్తం 46.22 కి.మీ. మేరకు 42 స్టేషన్లతో విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టు నిర్మించాలని ప్రతిపాదించారు. విశాఖ స్టీల్ ప్లాంటు-కొమ్మాది కూడలి వరకు ఒక కారిడార్ నిర్మించనున్నారు. ఈ కారిడార్ 34.40 కి.మీ మేర ఉండనుంది. ఈ కారిడార్‌లో 29 మెట్రోస్టేషన్లు ప్రతిపాదించారు. అలాగే గురుద్వారా నుంచి పాత పోస్టాఫీసు వరకు రెండో కారిడార్ నిర్మించాలని ప్రతిపాదించారు. ఈ కారిడార్‌లో 5.07 కి.మీ.లలో 6 స్టేషన్లు ఉండనున్నాయి. తాటిచెట్లపాలెం - చినవాల్తేరు 6.75 కిలోమీటర్ల మేరకు మూడో కారిడార్ నిర్మించనున్నారు. ఈ కారిడార్‌లో 7 మెట్రో స్టేషన్లు ఉండనున్నాయి.

అలాగే విశాఖ మెట్రో ప్రాజెక్టులో ఐదు ఇంటిగ్రేటెడ్ మెట్రో స్టేషన్లు కూడా ఉండనున్నాయి. రెండు, మూడు ప్రాంతాలను కలుపుతూ ఐదు చోట్ల ఈ ఇంటిగ్రేటెడ్ మెట్రో స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. ఎన్ఏడీ కూడలి, తాటిచెట్లపాలెం, గురుద్వారా కూడలి, మద్దిలపాలెం, హనుమంతువాక కూడలి వద్ద ఈ సమీకృత మెట్రో స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. ఇక విశాఖపట్నం మెట్రో రైలు ప్రాజెక్టు కోసం కేంద్రం అందించే సహకారంతో పాటుగా.. బ్యాంకుల నుంచి రుణం సేకరించనున్నారు. ఆందులో భాగంగానే ఏడీబీ ప్రతినిధులు సోమవారం విశాఖలో పర్యటించారు.



## అసంపూర్తిగా నిర్మించిన పెబ్బేరు వనపర్తి బీటీ రోడ్డును పూర్తి చేయాలి..

ఉదయం న్యూస్ వనపర్తి

ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎత్తం మహేష్‌వనపర్తి జిల్లా కేంద్రం నుండి పెబ్బేరు రోడ్డుకు నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు జరుగుతున్నాయని. రోడ్డు మాత్రం పెబ్బేరు నుంచి నాచహళ్లి వరకు మాత్రమే నిర్మాణం చేశారని నచహళ్లి నుంచి వనపర్తి వరకు రోడ్డు మరీ అధ్వానంగా తయారైందని గుంతల మయంగా వాహనదారులకు పూర్తిగా ఇబ్బందికరంగా మారి వాహన చోదకులు కింద పడుతున్నారని. వర్షం వస్తే ఈ ఇబ్బంది మరింత ఎక్కువగా ఉంటుందని తక్షణమే అసంపూర్తిగా ఉన్న ఈ బీటీ రోడ్డు నిర్మాణం ను పూర్తి చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎత్తం మహేష్ డిమాండ్ చేశారు. లేనియెడల వాహన చోదకులతో కలిసి ఆర్ అండ్ బి కార్యాలయం ముందు ధర్నా చేపడతామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు అశోక్ ఎత్తం విష్ణు పాల్గొన్నారు.



## భూమి పూజ కార్యక్రమం

ఉదయం న్యూస్ ఆళ్లగడ్డ...

ఇచ్చిన మాట ప్రకారం ఆళ్లగడ్డ పట్టణంలోని సెంటెన్స్ స్కూల్ నుండి అభిరుచి హోటల్ వరకు నూతన సీసీ రోడ్లు 25 లక్షల రూపాయలతో భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ గారు... సెంటెన్స్ స్కూల్ లో ప్రోగ్రాం కు వెళ్ళినప్పుడు టీచర్స్ అందరూ వర్షం పడితే పిల్లలు రావడానికి చాలా ఇబ్బందిగా ఉందని రోడ్డు కావాలని చెప్పి అడగడంతో ఇచ్చిన మాట ప్రకారం ఈరోజు భూమి పూజ కార్యక్రమం లో పాల్గొనడం జరిగింది...ప్రజలకు ఇచ్చిన మాట సూపర్ సిక్స్ పథకాలు అన్నింటినీ అమలు పెట్టి ప్రజలందరికీ ఇబ్బంది కలగకుండా చూసుకుంటున్న కూడా ప్రభుత్వన్ని చూసి వైసీపీ నాయకులు చూసి ఓర్వలేక పోతున్నారు... సాక్షి పేపర్ లో నేను కళ్ళు తిరిగి హాస్పిటల్లో ఉంటే నన్ను చూడ్డానికి ఎవరో వచ్చారు ఎవరు రాలేదంటూ రాస్తున్నారు. ఉదయం లేస్తే నేనేం చేస్తున్నాను నాకు ఎవరు దూరమయ్యారు ఇలా కల్పితాలన్ని రాయడం పక్కనపెట్టి ఆళ్లగడ్డలో మేము ప్రజలకు చేస్తున్న సేవలు రాయండి. మార్కెట్ యార్డ్ లో రైతులు పడుతున్న ఇబ్బందులు గురించి రాయండి అంతే కానీ ఊరికే కలిపి తల రాయదు....ఆళ్లగడ్డ అభివృద్ధి కోసం ఈరోజు 15%ష్ట్ర% ఫైనాన్స్ కింద సిసి రోడ్ల నిర్మాణాలకు చాలా వరకు భూమి పూజ చేయడం జరిగింది...అహోబిలం డెవలప్మెంట్ కు 25 కోట్ల రూపాయలు సెంట్రల్ గవర్నమెంట్ నుండి శాంక్షన్ అవ్వడం జరిగింది ఇదే కాకుండా ఆళ్లగడ్డ అభివృద్ధి కోసం ఎంతైనా కృషి చేస్తానని చెప్పిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ గారు...

## కొమ్మినేనిపై చంద్రబాబు కక్ష ఇప్పటిది కాదు..

ఏపీ: సీనియర్ పాత్రికేయుడు కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్ట్‌పై వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్పందించారు. కొమ్మినేని అరెస్ట్‌ను తీవ్రంగా ఖండించిన వైఎస్ జగన్.. ఏపీలో అరాచకం రాజ్యమేలుతోందని ఆరోపించారు. ప్రజల తరుపున ప్రశ్నించే గొంతులను అణిచివేయాలని ప్రయత్నిస్తున్నారని.. అధికార దుర్విని యోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. చంద్రబాబు ఎల్లప్పుడూ అధికారంలో ఉండరన్న వైఎస్ జగన్.. మరో నాలుగేళ్ల తర్వాత చేసిన ప్రతి పనికి బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని సూచించారు.

సీనియర్ జర్నలిస్ట్ కొమ్మనేని శ్రీనివాసరావు అరెస్ట్‌పై మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్పందించారు. కొమ్మినేని అరెస్ట్‌ను తీవ్రంగా ఖండిం చిన వైఎస్ జగన్.. ఆంధ్రప్రదేశ్ అరాచకానికి కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయిందంటూ ఆరోపించారు. ఆంధ్రప్ర దేశ్‌లో ప్రజాస్వామ్యం, చట్టం, న్యాయం ఖూనీ అవుతు న్నాయని.. ప్రజలు, ప్రజాస్వామ్యవాదుల్ని, మేధావుల్ని, జర్నలిస్టుల్ని భయకంపితుల్ని చేస్తున్నారని వైఎస్ జగన్ ఆరోపించారు. ఏడాది కాలంగా చంద్రబాబు చేస్తున్న అరాచక, అన్యాయ పాలనపై ప్రజల తరఫున ఎవరూ గొంతెత్తకుండా అణిచివేసేందుకు ప్రయత్నిస్తున్నారని వైఎస్ జగన్ ఆరోపించారు. తన దుర్మార్గపు పాలన, మోసాలు, అవినీతి, వైఫల్యాలపై స్వరం వినిపించకుండా తీవ్ర అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని జగన్ విమర్శించారు.

70 ఏళ్ల వృద్ధుడైన సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును తాను చేయని వ్యాఖ్యలకు అరెస్టు చేసి కక్షసాధింపులకు పాల్పడుతున్నారని వైఎస్ జగన్ విమర్శించారు. డిబేట్ జరిగే సమయంలో వక్తలు మాట్లాడే మాటలకు, యాంకర్‌కు ఏం సంబంధం ఉంటుందని వైఎస్ జగన్ ప్రశ్నించారు. సహజంగానే ఓ డిబేట్‌లో వక్తలు కొందరు అనుకూలంగానూ, మరికొందరు వ్యతిరేకంగానూ మాట్లాడుతారని జగన్ గుర్తు చేశారు.

## అసలేం జరిగిందో చెప్పిన కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి



నెల్లూరు: రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిపై సోషల్ మీడియాలో ఓ పోస్టు వైరల్ అవుతోంది. నెల్లూరులో నైటీల షాప్ ప్రారంభించిన కోటంరెడ్డి అంటూ.. ట్రోల్స్ చేస్తున్నారు. వైసీపీ శ్రేణులు దీనిపై విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ క్రమంలోనే ఆరోజు ఏం జరిగిందనే దానిపై కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. సోషల్ మీడియాలో వైసీపీ చేస్తున్న ట్రోలింగ్‌కు దీటైన జవాబిచ్చారు. అలాగే నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 18 గ్రామాల్లో పల్లెపండుగ కార్యక్రమాలు పూర్తైనట్లు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి వెల్లడించారు.

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి గురించి సమకాలీన రాజకీయాలపై అవగాహన ఉన్నవారికి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. గతంలో వైసీపీలో కొనసాగిన ఆయన.. 2024 ఎన్నికలకు ముందు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. 2024 ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ నుంచి నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి.. విజయం సాధించారు. అనంతరం నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి కూడా ప్రశంసలు అందుకున్నారు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. ఒకే రోజు రికార్డు స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేసిన కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి వార్తల్లో నిలిచారు. ఆపనుల పనితీరును స్కూటర్ మీద తిరుగుతూ పర్యవేక్షిస్తూ గడువులోగా పూర్తి చేయించారు. అయితే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి సంబంధించి ఓ ఫోటో నెట్టింట వైరల్ అవుతోంది. వైసీపీ శ్రేణులు ఈ ఫోటోను చాలా రోజుల నుంచి వైరల్ చేస్తున్నాయి.

తాజాగా కోటంరెడ్డి శ్రీధర్ రెడి ఫోటోను, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఫోటోను కూడా కలిపి వైరల్ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తరలి వచ్చిన భారీ పరిశ్రమలు.. ఒకటి నెల్లూరులో నైటీలు షాప్.. రెండు విజయవాడలో కటింగ్ షాప్ అంటూ సోషల్ మీడియాలో ట్రోల్స్ వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి స్పందించారు. తనపై వస్తున్న ట్రోల్స్‌కు దీటుగా బదులిచ్చారు. అసలు ఆ రోజు ఏం జరిగిందో చెప్తూ ట్వీట్ చేశారు.

ఒక నిరుపేద సోదరి, తన రెక్కల కష్టంతో జీవనోపాధి కోసం నెలకొల్పిన ఒక చిన్న వస్త్రాల దుకాణం ప్రారంభోత్సవానికి, స్థానిక కమ్యూనిస్టు నాయకుల ఆహ్వానంపై తాను వెళ్లినట్లు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తెలిపారు. తన ఆశయాన్ని నిలబెట్టేందుకు ఒక ప్రజాప్రతినిధిగా హాజరైన సందర్భాన్ని అపహాస్యం చేయడం, వారి అవగాహ న స్థాయి ప్రతిబింబంగా భావిస్తున్నానంటూ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు.

మరోవైపు నెల్లూరు రూరల్ నియోజకవర్గం లోని 18 గ్రామాల్లో చంద్రన్న పల్లెపండుగ కార్యక్రమం ముగిసింది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి వెల్లడించారు. 18 గ్రామాలలో.. 11 కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనులు చేసి.. ప్రజలకు అంకితం చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో, ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు పూర్తి చేసి, నియోజకవర్గ ప్రజలకు అంకితం చేస్తున్నట్లు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

మరోవైపు కృష్ణా జిల్లా పెనమలూరులో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదివారం పర్యటించారు. కానూరులో పవన్ కళ్యాణ్ సెలూన్ షాపు ప్రారంభించారు. పవన్ కళ్యాణ్‌ను చూడడానికి అభిమానులు భారీగా అక్కడకు తరలి వచ్చారు. పవన్ కళ్యాణ్‌తో సెల్ఫీలు దిగడానికి పోటీ పడ్డారు. పవన్ కళ్యాణ్ టీషర్టు, షార్టులో స్టైలిష్‌గా కనిపించడం విశేషం.

## టీడీపీ మహిళా ఎమ్మెల్యేకు అస్వస్థత.. హుటాహుటిన ఆస్పత్రికి తరలింపు

ఉపవాస దీక్షలో ఉండటంతో పాటుగా ఎండలు, నీరసం కారణంగా సొమ్మసిల్లి పడిపోయినట్లు



నంద్యాల: జిల్లాలో టీడీపీ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఒక్కసారిగా సొమ్మసిల్లి పడిపోవడంతో కలకలం రేగింది. దొర్నిపాడు మండలం డబ్లుగోవిన్నెలో జరుగుతున్న జాతరలో పూజలు చేస్తుండగా ఈ ఘటన జరిగింది. వెంటనే ఆమెను ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఉపవాస దీక్ష, ఎండలు, నీరసం కారణంగానే అఖిలప్రియ స్పృహ తప్పి పడిపోయారని వైద్యులు తెలిపారు. అయితే భూమా అఖిలప్రియ ఆరోగ్యం నిలకడగా ఉందని సమాచారం.

నంద్యాల జిల్లా టీడీపీ ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అస్వస్థతకు గురయ్యారు. అఖిల దొర్నిపాడు మండలం డబ్లుగోవిన్నెలో స్థానికంగా జరుగుతున్న ఓ జాతరకు వెళ్లారు.. అక్కడ ఆలయంలో పలు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అయితే అఖిలప్రియ ఒక్కసారిగా సొమ్మసిల్లి కింద పడిపోయారు. వెంటనే కుటుంబసభ్యులు, సిబ్బంది ఆమెను ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వైద్యులు ఆమెను పరీక్షించి వెంటనే వైద్యం అందించారు. ఉపవాస దీక్షలో ఉండటంతో పాటుగా ఎండలు, నీరసం కారణంగా సొమ్మసిల్లి పడిపోయినట్లు చెబుతున్నారు. ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉందని.. ఎలాంటి ఇబ్బంది లేదని చెబుతున్నారు.

రెండు రోజులుగా అఖిలప్రియ జాతరకు సంబంధించి ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. 'దొర్నిపాడు మండలం .గోవిందిన్నె గ్రామంలో వెలసిన శ్రీ మూల పెద్దమ్మ తల్లి దేవర సందర్భంగా ప్రజలు ఎవరికీ ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ మెడికల్ క్యాంపు మరియు వచ్చిన ప్రజలకు వసతి అన్నింటిని పరిశీలించడం జరిగింది' అంటూ ట్వీట్ చేశారు. ఇవాళ ఆలయంలో పూజలు చేస్తుండగా ఒక్కసారిగా సొమ్మసిల్లి పడిపోయారు. ఇటీవల మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కూడా ఇలాగే సొమ్మసిల్లి పడిపోయారు. వైఎస్సార్‌సీపీ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న బొత్స ఒక్కసారిగా పడిపోగా ఆస్పత్రికి తరలించారు. ఆయన కూడా ఎండ కారణంగా అస్వస్థతకు గురైనట్లు డాక్టర్లు చెప్పారు. ఇప్పుడు అఖిలప్రియ కూడా అలాగే సొమ్మసిల్లి పడిపోయారు.

ఇటీవల భూమా అఖిలప్రియ సీరియస్ వ్యాఖ్యలు చేశారు. తమ ప్రమేయం లేకుండా పార్టీలో పదవులు ఇస్తున్నారని వ్యాఖ్యానించారు. తనకు తెలియకుండా ఎవరికైనా పదవి ఇస్తే ఊరుకునేది లేదన్నారు. అలాంటి వారిని నియోజకవర్గంలో అడుగుపెట్టనిచ్చేది లేదని ఘాటుగా స్పందించారు. టీడీపీ కోసం, భూమా కుటుంబం కోసం పనిచేసిన వారికి పదవులు ఇప్పిస్తామన్నారు.. మొదటి నుంచి పార్టీలో ఉన్న వారికి మాత్రమే పదవులివ్వాలని తేల్చి చెప్పారు. అలాగే తాము అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తానని తనపై వచ్చిన విమర్శలకు కౌంటరిచ్చారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలను సరిదిద్దే పనిలో ఉన్నామని.. కొందరు తమపై పని కట్టుకొని మరీ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

## క్యాన్సర్‌పై తేల్చి చెప్పిన ముద్రగడ పద్మనాభం



ఏపీ: ముద్రగడ పద్మనాభ రెడ్డికి క్యాన్సర్ అంటూ కుమార్తె క్రాంతి చేసిన ఆరోపణలకు ఆయన ఘాటుగా స్పందించారు. వృద్ధాప్యం వల్ల వచ్చిన ఆరోగ్య సమస్యలే తప్ప క్యాన్సర్ లేదని తేల్చి చెప్పారు. తనను బంధించారని, మానసిక ంగా హింసిస్తున్నారని వస్తున్న వార్తలను ఖండించారు. రాజకీ యంగా తన కొడుకును ఎదుర్కోలేకే ఇలాంటి కుట్రలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

వైఎస్సార్‌సీపీ నేత ముద్రగడ పద్మనాభ రెడ్డికి క్యాన్సర్ అంటూ కుమార్తె క్రాంతి సంచలన ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఈ ఎపిసోడ్‌పై ఎట్టకేలకు ముద్రగడ పద్మనాభరెడ్డి స్పందించారు. తాను వృద్ధాప్యం వల్ల వచ్చిన ఆరోగ్యపరమైన సమస్యలతో బాధపడుతున్నానని.. తనకు క్యాన్సర్ లేదని చెప్పారు. కొందరు తన కుమారుడు రాజకీయ ఎదుగుదలను చూడలేక దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ మేరకు ముద్రగడ పద్మనాభం ఓ లేఖను విడుదల చేశారు. 'గౌరవ ప్రజానికానికి ముద్రగడ పద్మనాభరెడ్డి నమస్కారములండి.. ఈ మధ్య మా కుటుంబంపై ఒక కుటుంబం దాడి చేస్తున్న సంగతి మీకు తెలుసు. ఆ కుటుంబానికి, మాకు చాలా సంవత్సరాల క్రితమే మనస్పర్ధలు వచ్చాయి. ఒక సంవత్సరము నుంచి పూర్తిగా అన్ని రకాల రాకపోకలు బంద్ అయ్యాయండి, వారి జోలికి నేను వెళ్లడం లేదు. అయినా మమ్ములను టార్గెట్ చేస్తున్నారండి.. కారణం మా చిన్నాబ్బాయి గిరిబాబు ఎదుగుదల చూడలేక అసూయతో రగలిపోతున్నారండి. నాకు క్యాన్సర్ వచ్చిందని ఇంట్లో బంధించి చిన్న కొడుకు, వారి మామగారు పట్టించుకోవడం లేదని బాధాకరమైన మాటలు అంటున్నారండి. రోజు అన్ని సేవలు నాకు చేయకుండా బయటకు వెళ్లడండి' అంటూ వివరణ ఇచ్చారు ముద్రగడ పద్మనాభం. 'వీరి ఉద్దేశ్యం మా అబ్బాయిని దూరం చేస్తే వారింటికి చేరతానని, వారి అడుగులకు మడుగులొత్తుతానని అనుకుంటున్నారేమో? అది ఈ జన్మకు కాదు ఎన్ని జన్మలు ఎత్తినా ఆ ఇంటికి వెళ్లడం జరగదు. గతంలో నా భార్యకు తీవ్ర అనారోగ్యం వచ్చినప్పుడు హైదరాబాద్ ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించుకుని సుమారు 15 రోజులు తర్వాత ఆస్పత్రి నుంచి విశ్రాంతి కోసం మీ ఇంటికి వస్తే ఇంటి నుండి బయటికి పంపిన సంగతి మీ ఇరువురూ మర్చిపోయారా?.. ఇప్పుడు మీ మాటలు వింటుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుంది' అన్నారు.

'నాకు వయస్సు రీత్యా వచ్చే ఆరోగ్య సమస్యలు తప్ప మరే సమస్యలు లేవండి. నేను పార్టీ కార్యక్రమాలకు హాజరవుతున్నానండి, నిత్యం నా ఇంటికి వచ్చిన అభిమాన ప్రజలందరితోనూ కలుస్తున్నానండి. నన్ను బంధించి ఉంచడం కాని, మానసికంగా హించించడం కాని ఎవ్వరి తరం కాదని తెలియజేస్తున్నానండి. మీకు అంత దమ్ము ఉంటే కాపు రిజర్వేష న్, ముఖ్యమంత్రిఎన్నికలలో ఇచ్చిన హామీలను , సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయించి మీ డబ్బా కొట్టుకోండి. నిజంగా అదే నిజమైతే రాష్ట్ర ముఖ్యమంత్రి గారిని, లోకేష్ బాబుని మరియు ఉప ముఖ్యమంత్రిని చూసి జాలి పడుతున్నా నండి. ఇకనైనా మీ అపాయింట్మెంట్లు, చీప్ పబ్లిసిటీ కోసం దిగజారి బ్రతక్కండి' అంటూ ఘాటుగా స్పందించారు.

## గొర్రెను కసాయివాడికి అప్పగించినట్లు..

ఏపీ: విశాఖపట్నం జిల్లాలో జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విజయనగరానికి చెందిన ఓ బాలిక అమ్మమ్మ వద్ద ఉంటోంది. ఆ బాలికకు ఉపాధి చూపిస్తానని నమ్మించి.. ఓ యువకుడు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఏప్రిల్ నెలలో ఈ దారుణం జరగ్గా.. శనివారం బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో వెలుగులోకి వచ్చింది. నిందితులపై పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు.. నూకరాజు అనే యువకుడితో పాటు.. అతనికి సహకరించిన హేమలత అనే మహిళను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఆంధ్రప్రదేశ్‌లో మరో దారుణ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఉపాధి చూపిస్తానంటూ ఓ బాలికపై యువకుడు అత్యాచారానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. భీమిలి పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం. విజయనగరానికి చెందిన ఓ బాలిక భీమిలిలో అమ్మమ్మ వద్ద ఉంటోంది. అక్కడే పదో తరగతి వరకూ చదువుకుంది. ఈ సమయంలోనే హేమలత అనే మహిళతో బాలికకు పరిచయమైంది. మాటలతో మొదలైన పరిచయం.. బాగా నమ్మకంగా మారింది. ఈ క్రమంలోనే హేమలత ఆ బాలికను తిమ్మాపురంలో ఉండే నూకరాజు అనే వ్యక్తికి పరిచయం చేసింది. నూకరాజు రాడ్ బెండింగ్ పనులు చేస్తుంటాడు. అయితే ఉపాధి చూపిస్తానని బాలికను నమ్మించిన నూకరాజు.. దారుణానికి ఒడిగట్టాడు.


బాలికను ఇంటికి తీసుకువెళ్లిన నూకరాజు.. బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఏప్రిల్ నెల చివర్లో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బాలిక తల్లిదండ్రులు శనివారం భీమిలి పోలీసులకు దీనిపై ఫిర్యాదు చేయటంతో అసలు వాస్తవం వెలుగులోకి వచ్చింది. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు.. బాలికను వైద్య పరీక్షల కోసం కేజీహెచ్‌కు తరలించారు. నూకరాజుతో పాటుగా అతనికి సహకరించిన హేమలత అనే మహిళను అరెస్ట్ చేశారు. వారిపై పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు.. ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

మరోవైపు శ్రీసత్యసాయి జిల్లాలోనూ ఇటీవల ఇలాంటి ఘటనే వెలుగుచూసింది. ఓ దళిత బాలికపై కొంతమంది అఘాయిత్యానికి పాల్పడగా.. బాలిక గర్భం దాల్చటంతో కీచకపర్వం వెలుగులోకి వచ్చింది. ఎనిమిదో తరగతి చదువుతున్న ఓ బాలికను ఓ యువకుడు ప్రేమ పేరుతో నమ్మించాడు. అమాయకంగా నమ్మిన బాలికపై అత్యాచారం చేశాడు. ఈ విషయాన్ని తన స్నేహితుడికి చెప్పాడు. ఆ స్నేహితుడు కూడా ఆ బాలికపై అఘాయిత్యానికి ఒడిగట్టాడు.

అంతటితో ఊరుకోకుండా మరో ఫ్రెండ్ సాయంతో ఆ దారుణాన్ని వీడియో తీయించాడు. సెల్‌ఫోన్ ఈ వీడియో తీసి వాట్సాప్‌లో షేర్ చేయటంతో.. ఈ వీడియోతో భయపెట్టి ఆ బాలికపై 13 మంది అఘాయిత్యానికి పాల్ప డ్డారు. బాలిక గర్భం దాల్చడంతో ఈ విషయం వెలుగులోకి రాగా.. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.

## దెబ్బకు పెళ్లంటే పారిపోతారు!

ఏపీ: ఓ యువకుడ్ని పెళ్లి పేరుతో ఓ మహిళ మోసం చేసిన సంఘటన చూస్తే.. దెబ్బకు పెళ్లి అంటేనే పారిపోతారు. వివాహమైన వారానికే ఆమె యువకుడికి ఎలా హ్యాండ్ ఇచ్చిందో చూస్తే ముక్కున వేలేసుకుంటారు. వివరాల్లోకి వెళ్తే శ్రీ సత్యసాయి జిల్లా కొత్తచెరువుకు చెందిన యువకుడు రాజశేఖర్ రెడ్డి బాగా చదువుకున్నాడు. అతడు ప్రస్తుతం బెంగళూరులోని ఓ ఆటోమొబైల్ కంపెనీలో ఉద్యోగం కూడా చేస్తున్నాడు. పెళ్లి చేసుకోవాలని భావించి కొంతకాలంగా.. మ్యారేజ్ బ్యూరోలను సంప్రదిస్తున్నాడు. ఈ ప్రయత్నాల్లో రాజశేఖర్ రెడ్డికి అతడి స్నేహితుడైన కృష్ణారెడ్డి ద్వారా గుంటూరుకు చెందిన మల్లేశ్వరి, మంగళగిరికి చెందిన కొండలమ్మ అనే ఇద్దరు మహిళలు పరిచయం అయ్యారు. ఆ



ఇద్దరు మహిళలు ఓ అమ్మాయి ఉందని.. పెళ్లి చేస్తామని యువకుడ్ని నమ్మించారు. తమకు తెలిసిన కరుణావతి అనే యువతికి తల్లిదండ్రులు లేరని.. ఆమెతో మాట్లాడి పెళ్లికి ఒప్పిస్తామన్నారు. కాకపోతే ఆ యువతికి ఎదురు కట్నంగా డబ్బుల ఇస్తే పెళ్లి చేస్తామని మాయ మాటలు చెప్పారు.

# హుస్నాబాద్ నియోజకవర్గం పందిళ్ల గ్రామంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా నాగలి దున్నిన మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్ ప్రతినిధి, ఉదయం న్యూస్**



పందిళ్ళ లో ఏరువాక సందర్భంగా మాందాటి వెంకట్ రెడ్డి పొలంలో ఎడ్ల తో నాగలి దున్ని రైతులతో కలిసి పెసర విత్తనాలు చల్లిన మంత్రి పొన్నం ప్రభాకర్.
కార్యక్రమంలో పాల్గొన్న సిద్దిపేట
గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, ఆర్డీవో, వ్యవసాయ శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు
మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.
ఏరువాక పౌర్ణమి సందర్భంగా రైతు సోదరులకు శుభాకాంక్షలు
రైతులు దుక్కి దున్ని విత్తనాలు వేస్తారు.
రైతులు ఒక్క గుంట కూడా బీడు లేకుండా వరి, మొక్కజొన్న , ఆయిల్ ఫాం ఇతర ఏదైనా పంటలు వేయాలి
రైతులు ఎక్కడ ఖాళీ జాగా బీడు లేకుండా చూడాలి.
రైతులకు ప్రభుత్వం ఉచిత విద్యుత్, సాగునీరు, పెట్టుబడి సహాయం, మద్దతు ధర అందిస్తున్నాం.
రైతులకు ఏ ఇబ్బంది లేకుండా రైతుల సంక్షేమం కోసం కట్టుబడి ఉండే ప్రభుత్వం మాది
ఏరువాక పౌర్ణమి సందర్భంగా తెలంగాణ రైతాంగానికి శుభాకాంక్షలు.
ఈసారి మంచి వర్షాలు పాడి పంటలతో ఉండాలి తెలంగాణ రాష్ట్రం దేశంలో ఉత్పత్తులు ఎగుమతి చేసే రాష్ట్రంగా ఎదగాలని ఆకాంక్షిస్తున్న
అందుకు రైతుల శ్రమ ప్రకృతి సహకారం అవసరం.
హుస్నాబాద్ నియోజకవర్గం లో అన్ని రాజకీయ మిత్రులు అధికారులు ఎక్కడ ఖాళీ స్థలం లేకుండా చూసుకోవాలి
విత్తనాలు వేసుకునే శక్తి లేని వారికి మా కార్యాలయాన్ని సంప్రదించండి.
మేము విత్తనాలు అందిస్తాం మీరు ఖాళీ జాగా లేకుండా పంటలు వేయాలి
హుస్నాబాద్ లో మూడు రోజుల పాటు రైతు మహోత్సవం కార్యక్రమం జరిగింది.
ఈ ప్రాంత రైతాంగానికి వ్యవసాయ విధానాలు పద్ధతులు పై మూడు రోజుల కాన్ఫరెన్స్ జరిగింది.
పంటలు, యాంత్రీకరణ తదితర అంశాలపై రైతులు అవగాహన చేసుకున్నారు మంత్రి పొన్నం ప్రభాకర్ రైతులు అందరికీ శుభాకాంక్షలు.

# ఈనెల 14న జరుగు జాతీయ మెగా లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి!!

**సిద్దిపేట ప్రతినిధి, ఉదయం న్యూస్**



రాజీమార్గం రాజమార్గంసమయాన్ని డబ్బులను ఆదాచేసుకోవాలికక్ష కారుణ్యాలతో ఏమీ సాధించలేము.రాజీ పడితే ఇద్దరూ గెలిచినట్లే
లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం జరుగుతుంది కొట్టుకుంటే ఒకరే గెలుస్తారు రాజీ పడితే ఇద్దరు గెలుస్తారు.పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ.
14-06-2025 నాడు జాతీయ మెగా లోక్ అదాలత్ ఉన్నందున రాజీ పడ దగిన కేసులలో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబపరమైన నిర్వాహణ కేసులు, రోడ్డు ప్రమాదాల కేసులు, చిన్న చిన్న దొంగతనాల కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ మరియు టౌన్ న్యూసెన్స్ కేసులు, బ్యాంకు రికవరీ, టెలిఫోన్ రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ కేసులో మరియు ఇతర రాజీ పడ్డ దగిన కేసుల్లో కక్షిదారులు రాజీ పడాలని సూచించారు. రాజీ మార్గం రాజ మార్గమని చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని డబ్బులను వృధా చేసుకోవద్దని, జుడిషియల్ డిపార్ట్మెంట్ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పోలీస్ అధికారులు కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్ లు మరియు పోలీస్ సిబ్బంది రాజీ పడ్డ దగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ పడేటట్లు అవగాహన కల్పించాలని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుందని కమిషనర్ తెలిపారు.



స్టేట్ గెస్ట్ హౌస్ లో జిల్లా ఇంచార్జి మంత్రి మరియు జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గారిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించిన జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా గారు, ఎస్పీ విక్రాంత్ పాటిల్ గారు, జాయింట్ కలెక్టర్ డా.బి నవ్య గారు, కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర బాబు గారు



కల్లూరు మండలం తడకనపల్లె గ్రామ శివారులో ఏరువాక పౌర్ణమి దినోత్సవం సందర్భంగా జగన్నాథం అనే రైతు పొలంలో ఉల్లి విత్తనం వేస్తున్న సందర్భంగా అరక పట్టి పొలం దున్నుతున్న జిల్లా ఇంచార్జి మంత్రి మరియు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి వర్యులు నిమ్మల రామానాయుడు గారు..పాల్గొన్న ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి గారు, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా గారు

# కడప, ప్రొద్దుటూరు ఎంఈఓ లను సస్పెండ్ చేయాలి.

-డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు కు యుటిఎఫ్ వినతి.

**బద్వేలు ఉదయం ప్రతినిధి**

సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ బదిలీలలో ప్రిఫరెన్షియల్ కేటగిరిలో కేటాయించవలసిన స్థానాల కంటే అధికంగా కేటాయించి, బదిలీల చట్టం-2025ను ఉల్లంఘించి ఇష్టారాజ్యంగా వ్యవహరించిన కడప, ప్రొద్దుటూరు మండల విద్యాశాఖాధికారులు గంగిరెడ్డి, సావిత్రమ్మలను సస్పెండ్ చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబులు డిమాండ్ చేశారు. కడపలోని స్కౌట్ హాలు నందు విద్యాశాఖ నిర్వహిస్తున్న బదిలీల్లో ఎంఈఓలు వ్యవహరించిన తీరు వల్ల ఉపాధ్యాయులకు జరిగిన తీవ్ర నష్టాన్ని వివరిస్తూ బుధవారం ఉదయం కలెక్టరేట్లో జిల్లా రెవిన్యూ అధికారి ఎం.విశ్వేశ్వర నాయుడు కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన బదిలీల చట్టం-2025 ప్రకారం ప్రిఫరెన్షియల్ కేటగిరికి ఒక పాఠశాలలో 40 శాతానికి మించి పోస్టులు కేటాయించకూడదనే స్పష్టమైన నిబంధనలు ఉన్నప్పటికీ



కడప మరియు ప్రొద్దుటూరు మండల విద్యాశాఖ అధికారులు చట్టాన్ని బేఖాతాలు చేస్తూ ప్రిఫరెన్షియల్ కేటగిరీకి ఇష్టారాజ్యంగా పోస్టులు కేటాయించారన్నారు. మంగళవారం చేపట్టిన మాన్యువల్ కౌన్సిలింగ్ నందు కడప, ప్రొద్దుటూరు మండలాల పరిధిలో నిబంధనల కంటే ఎక్కువ పోస్టులను ప్రిఫరెన్షియల్ కేటగిరీలో చూపించి జనరల్ కేటగిరిలో ఉన్నవారికి తీవ్ర అన్యాయం చేశారన్నారు. మండల విద్యాశాఖాధికారుల నిర్లక్ష్యం వల్ల దాదాపు పదిమంది జనరల్ కేటగిరి ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతోపాటు మధ్య రాత్రి 1:30 వరకు కౌన్సిలింగ్ ప్రక్రియ నిలిచిపోయి ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులతో పాటు ఒత్తిడికి గురయ్యారన్నారు. అధికారులు జరిగిన తప్పును గుర్తించి, కౌన్సిలింగ్ ను రద్దుచేసి తిరిగి కౌన్సిలింగ్ నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, తప్పును సరి చేయకుండా అర్ధ రాత్రి తర్వాత బదిలీల ప్రక్రియను కొనసాగించడం వల్ల ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించి బదిలీల చట్టాన్ని ఉల్లంఘించిన కడప, ప్రొద్దుటూరు మండల విద్యాశాఖాధికారులపై చర్యలు తీసుకోవడంతో పాటు నష్టపోయిన ఉపాధ్యాయులకు తగు న్యాయం చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు జరిగిన నష్టాన్ని రాష్ట్ర పాఠశాల విద్య కమిషనర్ తోపాటు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుక వెళుతున్నట్లు వారు వివరించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయకపోతే యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు.

# డబుల్ ఇంజన్ సర్కార్ తో ఏపీకి డబుల్ ధమాకా!!

**తిరుపతి, ఉదయం న్యూస్**

కేంద్రం అత్యధిక నిధులు అందిస్తున్నాం
మోదీ పాలన స్వర్ణయుగంయూపీఏ ఎన్డీఏ పాలనను బేరీజు వేయండి.మోదీ పాలనను ఆశీర్వదించండి
బీజేపీ కార్యకర్త నివాసంలో భోజనం చేసిన బండి సంజయ్.కంచి పీఠాధిపతి చంద్రశేఖర స్వామిజీని కలిసిన కేంద్ర మంత్రిపోలీసుల గౌరవ వందనం స్వీకరించిన బండి సంజయ్.పరేడ్ గ్రౌండ్ లో మొక్కలు నాటిన కేంద్ర మంత్రిడబుల్ ఇంజిన్ సర్కార్ కేంద్ర రాష్ట్రాల్లో ఒకే కూటమి పాలన, వల్ల ఆంధ్రప్రదేశ్ కు డబుల్ ధమాకా లభించిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఏ రాష్ట్రానికి లేనంతంగా ఏపీకి కేంద్రం నిధులు మంజూరు చేస్తోందన్నారు. ఆర్థిక సంక్షోభంలో కూరుకు పోయిన ఏపీని గట్టెక్కించేందుకు ప్రత్యేక ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. 11 ఏళ్ల మోదీ పాలన స్వర్ణయుగమని అభివర్ణించారు. యూపీఏ కాంగ్రెస్ కూటమి, పదేళ్ల పాలనకు, ఎన్డీఏ 11 ఏళ్ల పాలనను బేరీజు వేయాలని ప్రజలను కోరారు. 140 కోట్ల భారతదేశాన్ని వరుసగా మూడు దఫాలు పాలించే అవకాశం నరేంద్రమోదీ ఆధ్వర్యంలోని బీజేపీకి లభించిందన్నారు.
మోదీ సర్కార్ 11 ఏళ్ల పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ తిరుపతికి విచ్చేశారు. ఈ సందర్భంగా రేణిగుంట విమానాశ్రయంలో బండి సంజయ్ కు బీజేపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అనంతరం విమానాశ్రయం నుండి అలిపిరి పోలీస్ స్టేషన్ వద్దకు సంజయ్ తో కలిసి మోటార్ సైకిళ్లపై ర్యాలీగా వచ్చారు. అనంతరం స్థానిక హోటల్ లో 11 ఏళ్ల మోదీ పాలనపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ను బండి సంజయ్ ప్రారంభించారు. చిత్ర ప్రదర్శనను తిలకించారు. సంజయ్ అనంతరం టీడీడీ బోర్డు సభ్యులు భానుప్రకాశ్, జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్, స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాస్ తో కలిసి మీడియాతో మాట్లాడారు. ఆ తరువాత బీజేవైఎం కార్యకర్త పార్థసారధి నివాసంలో భోజనం చేశారు. అక్కడి నుండి కంచి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ చంద్రశేఖర సరస్వతి స్వామివారిని కలిశారు. వారితో కొద్దిసేపు భేట అయిన అనంతరం వారి ఆశీర్వాదం తీసుకున్నారు. అక్కడి నుండి నేరుగా పోలీస్ పరేడ్ గ్రౌండ్ కు వెళ్లా పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అక్కడే మొక్కలు నాటారు.
అంతకు ముందు మీడియా సమావేశంలో కేంద్ర మంత్రి



బండి సంజయ్ మాట్లాడిన వ్యాఖ్యల్లో ముఖ్యాంశాలిలా ఉన్నాయి.
ఎన్ డి ఏ పాలనకు 11 ఏళ్లు పూర్తి మోదీ పాలనకు ముందు, తరువాత ఉన్న తేడాను బేరీజు వేయాలని కోరేందుకే ఇక్కడికి వచ్చిన. యూపీఏ పాలనంటే గుర్తుకొచ్చేవి అవినీతి స్కాంలు, అరాచకాలు, కుటుంబ పాలన, ఉగ్రవాదం, మైనారిటీ సంతూష్టీకరణ రాజకీయాలే గుర్తుకొస్తయ్.. కానీ మోదీ పాలనంటే గుర్తుకొచ్చేది అభివృద్ధి, అవినీతిరహిత పాలన, దేశభక్తి, నూతన ఆవిష్కరణలు, వినూత్న ఆలోచనలు మోదీ పాలన స్వర్ణయుగం. 2 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థను 4 ట్రిలియన్లుగా తీసుకొచ్చారు. ఆర్థిక ప్రగతిలో 11నుండి 4వ స్థానానికి చేర్చారు మోదీ పాలన స్వర్ణయుగం.
ఏ పార్టీకైనా, ఏ నాయకుడి కైనా 140 కోట్ల భారత దేశాన్ని వరుసగా 11 ఏళ్లు పాలించే అవకాశం రావడం అరుదైన విషయం. ఆ అవకాశం మోదీ లభించింది. మరి 11 ఏళ్ల మోదీగారి పాలనలో ఏం సాధించారు? దేశాభివృద్ధి ఎట్లా జరిగింది? ప్రజలకు ఏ విధమైన మేలు జరిగిందనే అంశాలపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. మనం ఏం చేశామో తెలియాలంటే గతంలో ఉన్న వాళ్లు చేసిన దానితో పోల్చి చూస్తాం. అట్లాగే మన కంటే బెటర్ గా ఉన్న దేశాలతో పోల్చి చూడటం కూడా సహజమే. మోదీ పాలనకు ముందు దేశం ఎట్లా ఉండేది, ఇప్పుడెట్లా మారిందనే అంశాన్ని బేరీజు వేసుకోవాల్సిన సమయం వచ్చింది.
పూర్వం రాజుల పాలనలో శ్రీక్రిష్ణ దేవరాయుల పాలనను స్వర్ణయుగమని చెప్పుకునే వాళ్లం. ఆనాడు రాచరికంలో ఉండేవాళ్లు ఎన్నికల్లేవు ఇప్పుడు మనమంతా ప్రపంచంలో అత్యంత గొప్ప ప్రజాస్వామ్య దేశంలో ఉన్నాం. 5 ఏళ్లకోసారి ఓట్లతో ప్రజలు తీర్పు ఇస్తున్నారు. అయినప్పటికీ దేశ ప్రజలు 3సార్లు వరుసగా బీజేపీని గెలిపించి మోదీ అవకాశం ఇచ్చారు. వారసత్వ పార్టీలకు పాతరేసి ఛాయ్ వాలాకు పట్టం కట్టారు. ఈ లెక్కన చూస్తే 11 ఏళ్ల మోదీ పాలన స్వర్ణ యుగమని చెప్పవచ్చు. మరి దీనికి కొలమానం ఏమిటంటే అభివృద్ధి, సంక్షేమమే
అభివృద్ధి విషయానికొస్తే 2014కు ముందు భారతదేశ ఆర్థిక వ్యవస్థ 2 ట్రిలియన్లు మాత్రమే. నేడు 4 ట్రిలియన్లు దాటింది. ఆర్థిక ప్రగతిలో 11వ స్థానం నుండి 4వ స్థానానికి చేరుకుని అమెరికా, చైనా, జర్మనీ దేశాల సరసన చేరినం.
పేదల సంక్షేమంలో టాప్
81 కోట్ల మందికి పీఎం గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పథకం ద్వారా ఉచితంగా రేషన్
పిఎం ఏవై ద్వారా 4 కోట్ల ఇండ్ల నిర్మాణం. మరో 3 కోట్ల ఇండ్లకు కేంద్ర ఆమోదం
15 కోట్ల గ్రామీణ కుటుంబాలకు నల్లా కనెక్షన్లు 12 కోట్ల మందికి టాయిలెట్లు
ప్రధానమంత్రి సురక్షా భీమా యోజన ద్వారా 51 కోట్ల మందికి బీమా సౌకర్యం. పీఎం జీవన్ జ్యోతి బీమా యోజన కింద 23 కోట్ల 64 లక్షల మందికి లబ్ది చేకూర్చినం
2014 నాటికి 14 కోట్ల బ్యాంకు ఖాతాలు మాత్రమే, జన్ ధన్ ఖాతాలతో కలిపి 54 కోట్లు దాటిన బ్యాంకు అకౌంట్స్ పేదల జన్ ధన్ ఖాతాల్లో 43 లక్షల 80 వేల కోట్ల రూపాయల సంక్షేమ పథకాల నగదు జమ..
సొంతంగా పేదలు బ్యాంకుల్లో దాచుకున్న సొమ్ము 2 లక్షల 46 వేల కోట్లు.
ఆయుష్మాన్ భారత్ పథకం కింద 77 కోట్ల మందికి హెల్త్ కార్డ్స్, ఉచితంగా 5 లక్షల వరకు కార్పొరేట్ వైద్యం. సీనియర్ సిటిజన్స్ కు మోదీ పెద్ద కొడుకు.. అందరినీ ఆయుష్మాన్ భారత్ పరిధిలోకి తెచ్చి ఉచిత వైద్యం చేయిస్తున్నరు.
68 లక్షల మంది వీధి వ్యాపారులకు రుణాలు 52 కోట్ల 50 లక్షల మందికి ముద్రా యోజన రుణాలిచ్చినం
స్టాండప్ ఇండియా కింద ఎస్సీ, ఎస్టీలకు 14 వేల 700 కోట్లను మంజూరు. 15 లక్షల స్టార్టప్ లతో ప్రపంచంలోనే స్టార్టప్ ల స్థాపనలో ఇండియా నంబర్ 1గా మారింది.
కాంగ్రెస్ పాలనలో, గరిబీ హటావో కేవలం నినాదం మాత్రమే.. మోదీ సీఎం అయిన కొత్తలో ఏమన్నారో తెలుసా? నా కల భారతదేశంలో పేదవాడు కేవలం గణాంకాల్లో ఉండకూడదు, పాలసీలకు కేంద్ర బిందువుగా మారాలి అని చెప్పిండు. ఆయన కల నెరవేరింది. ఛాయ్ వాలా ప్రధాని అయ్యారు. ఏకంగా 27 కోట్ల మందికి పేదరికం నుండి విముక్తి కల్పించారు.

# ప్రైవేట్ స్కూళ్ళను రద్దు చేయటమే పరిష్కారం.!

జాతీయ బీసీ సంక్షేమ సంఘం స్టేట్ సెక్రటరీ వడ్డేపల్లి హనుమంతు

**హైదరాబాద్ ప్రతినిధి, ఉదయం న్యూస్**

నాణ్యమైన విద్య అందాలంటే దేశంలో ప్రైవేట్ పాఠశాలలను పూర్తిగా రద్దు చేయడం ఒక్కటే పరిష్కార మార్గంగా కనపడుతుంది. అప్పుడు ముఖ్యమంత్రుల పిల్లలు, మనుమలు మనుమరాళ్ళు, అధికారుల పిల్లలు, ధనవంతుల పిల్లలు, పేద వారి పిల్లలు అందరినీ ప్రభుత్వ బడిలో మాత్రమే చదివించాల్సి వుంటుంది. దాంతో బడుల పని విధానం, సౌకర్యాలు, విద్య నాణ్యత అన్నీ మెరుగవుతాయి. మండలానికి ఆరు నుండి పది పాఠశాలలు పెట్టి మిగతా చిన్న గ్రామాలకు రవాణా వ్యవస్థ ఏర్పాటు చేయడం ద్వారా పాఠశాలల సంఖ్య తక్కువై, సౌకర్యాలు మెరుగై విద్యాప్రమాణాలను పెంపొందుతాయి.
భారత రాజ్యాంగంలో పేర్కొన్నట్టు ప్రభుత్వమే అందరికీ నాణ్యమైన విద్యను అందించాలి. ఏ దేశంలో అయినా పేదరికం పోయిందంటే, బాగా అభివృద్ధి జరిగిందంటే దానికి పునాది పాఠశాల విద్య, కాలేజి విద్య, విశ్వవిద్యాలయ విద్య అనేది చారిత్రక సత్యం. కానీ మన దేశంలో ప్రభుత్వ పెద్దలు, రాజకీయ నాయకులు, కాంట్రాక్టులకిచ్చే ప్రాజెక్టు పనుల మీద ఉన్నంత శ్రద్ధ పిల్లలకు నాణ్యత కల్గిన చదువు చెప్పించడం మీద పెట్ట లేకపోతున్నారు. సివిల్ ఇంజనీరింగ్ ప్రాజెక్టులు, రియల్ ఎస్టేట్ లావాదేవీలు ఎన్నికలకు అవసరమైన డబ్బు సమకూరుస్తాయి. సర్కారు బడుల మీద పెట్టే పెట్టుబడులు డబ్బులు రాల్చవు కదా! అందుకే రాజకీయ నాయకులకు విద్య మీద సమయం వెచ్చించడం అయితే, అందరికీ నాణ్యమైన విద్య అందించడం మనకు అసాధ్యమేమీ కాదు. ఎలానో చూద్దాం. జిల్లాలో వున్న ఒక ప్రైవేట్ బడిలో ప్రతి 38 మంది విద్యార్థులకు ఒక టీచరు వుంటే, ఆ జిల్లాలో ప్రభుత్వ బడులలో ప్రతి 17 మంది విద్యార్థులకు ఒక టీచర్ వున్నారు.
ప్రైవేట్ యాజమాన్యం ప్రతీ విద్యార్థి మీద సగటున ప్రతి సంవత్సరం రూ.6,200 ఖర్చు పెట్టి ప్రైవేట్ యాజమాన్యం తల్లిదండ్రుల నుండి ఎంత మొత్తం రాబడుతున్నది అనేది వేరే విషయం, 86 శాతం విద్యార్థులకు నాణ్యతలో 'ఏ' గ్రేడ్‌లో తీర్చి దిద్దగలిగితే, మన సర్కారు బడులలో ప్రభుత్వం సగటున విద్యార్థికి ప్రతీ సంవత్సరం రూ.35,000- ఖర్చు పెట్టినా 67శాతం విద్యార్థులు 'సీ' గ్రేడు కంటే దాటలేక పోతున్నారు. ప్రైవేట్ యాజమాన్యం ఒక టీచరుకు నెలకు రూ.5,000 - నుండి రూ.20,000 వరకు సబ్జెక్టును బట్టి, చెల్లిస్తుంటే ప్రభుత్వం నెలకు ఒక టీచరుకు రూ.35000 నుండి రూ.1,20,000వరకు చెల్లిస్తుంది. మరి, లోపం ఎక్కడ వుంది? ప్రభుత్వ పరిపాలనలోనే అని చెప్పక తప్పదు. ఇదే జిల్లాలలో వెనకబడిన జిల్లా, ఒక మండలంలో పరిస్థితి విశ్లేషిస్తే నాలుగు పెద్ద గ్రామాలలో వున్న ప్రైవేట్ బడులలో 4500 మంది విద్యార్థులు చదువుతూ ఉంటే అదే మండలంలో 36 గ్రామాలలో వున్న ప్రభుత్వ బడులలో 1400 మంది చదువుతున్నారు. ఆ మండలంలో పేద, మధ్య తరగతి తల్లిదండ్రులు



అప్పులు చేసి సంవత్సరానికి ఒక్కొక్క విద్యార్థికి రూ.15,000 నుండి రూ. 30,000 వరకు ఫీజులు కడుతున్నారు. మిగతా మధ్యతరగతి కుటుంబాలు, ఒక మోతాదులో వున్న పెద్ద రైతులు వారి కుటుంబాలను పెద్ద పట్టణాలలో పెట్టి, పిల్లలను ప్రైవేట్ కాన్వెంట్ స్కూళ్లలో చదివించుకుంటున్నారు. 'ప్రభుత్వ బడులలో చదివించాలంటే నామోషీగా అనిపిస్తుంది' అని ఒక గ్రామంలో తల్లిదండ్రులు నాతో అన్నారు. పక్క ఇంటి వాళ్ల పిల్లలు టిప్ టాప్‌గా తయారై టై, బూట్లు వేసుకొని మండల కేంద్రంలోని ప్రైవేట్ బడికి వ్యాన్‌లో పోతుంటే మా పిల్లలను దీనావస్థలోవున్న ఊళ్లోని ప్రభుత్వ బడికి ఎలా పంపించాలని వారు వాపోయారు. ఇటీవలి కాలంలో వాట్సాప్‌లో ఒక 'బొమ్మ' విస్తృతంగా ప్రచారంలోకి వచ్చింది. ప్రైవేట్ బడి భవనం బ్రహ్మాండంగా వుంటుంది కాని ప్రైవేట్ టీచరు ఒక పెంకుటింటిలో నివసిస్తుంటారు. అదే ప్రభుత్వ బడి విషయానికి వస్తే ప్రభుత్వ బడి భవనం అధ్వాన్న స్థితిలో వుంటుంది. కాని ప్రభుత్వ టీచరు ఇల్లు జిల్లా ముఖ్య పట్టణంలో బ్రహ్మాండంగా వుంటుంది.
పరిస్థితిని అర్థం చేసుకోవడానికి చాలా చక్కని ఉదాహరణ.. జాతీయ బీసీ సంక్షేమ సంఘం స్టేట్ సెక్రటరీ వడ్డేపల్లి హనుమంత అన్నారు.



## పాక్ గగనతలం మూసివేత..
## విమానయాన సంస్థలకు డీజీసీఏ అడ్వైజరీ

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్– పాక్ మధ్య ద్వైపాక్షిక ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈక్రమంలో భారత్‌కు చెందిన విమానాలకు తమ గగనతలాన్ని మూసివేస్తున్నట్లు ఇటీవల పాకిస్థాన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ విమానయాన సంస్థలకు పలు సూచనలు జారీ చేసింది.

పాక్ గగనతలం మూసివేత కారణంగా ఎయిర్‌లైన్ కార్యకలాపాలు ప్రభావితమయ్యాయని డీజీసీఏ పేర్కొంది. అంతర్జాతీయ విమానాల రాకపోకలకు ప్రయాణ సమయం పెరగనున్నట్లు తెలిపింది. ఈక్రమంలోనే విమానయాన సంస్థలకు పలు అడ్వైజరీలు జారీ చేసింది. విమానాల ల్యాండింగ్, టేకాఫ్‌లకు సంబంధించిన కచ్చితమైన సమాచారాన్ని ప్రయాణికులకు అందించాలని సూచించింది. అంతేకాక.. విమానాల్లో ప్రయాణికులకు భోజనం, అత్యవసర పరిస్థితుల్లో వైద్య సదుపాయం, కస్టమర్‌కేర్ సర్వీసులతో సహా ఇతర సదుపాయాలను అందుబాటులో ఉంచాలని పేర్కొంది.

పహల్గాంలో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన పాశవిక దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో భారత్, పాక్‌ల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. పాక్‌తో దౌత్య సంబంధాలకు సంబంధించి భారత్ కీలక నిర్ణయాలు తీసుకుంది. సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేయడంతో పాటు పాక్ పౌరులు తక్షణమే భారత్ విడిచివెళ్లాలని ఆదేశించింది. ఈ చర్యలతో దాయాది దేశం అక్కసు వెళ్లగక్కుతూ.. సిమ్లా ఒప్పందంతోపాటు మిగిలిన ద్వైపాక్షిక ఒప్పందాలను పక్కనబెడుతున్నట్లు ప్రకటించింది. తమ గగనతలంలో భారత్‌కు చెందిన విమానాలకు అనుమతిని నిలిపేస్తున్నట్లు వెల్లడించింది.

## అమెజాన్ గ్రేట్ సమ్మర్ సేల్..
## శాంసంగ్ ఫోన్స్‌పై డిస్కౌంట్




ప్రముఖ ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ 'గ్రేట్ సమ్మర్ సేల్'ను ప్రకటించింది. మే 1 నుంచి ఈ సేల్ ప్రారంభం కానుంది. అమెజాన్ ప్రైమ్ సభ్యులకు 12 గంటల ముందునుంచే సేల్ అందుబాటులోకి రానుంది. అంటే మే 1వ తేదీ అర్ధరాత్రి నుంచే ప్రైమ్ యూజర్లు ఆఫర్లు పొందొచ్చు. మిగిలిన యూజర్లు ఒకటో తేదీ మధ్యాహ్నం 12 గంటల నుంచి ఈ సేల్‌లో పాల్గొనొచ్చు. సేల్‌లో భాగంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కస్టమర్లు 10 శాతం డిస్కౌంట్ పొందొచ్చు. క్రెడిట్ కార్డు, ఈఎంఐ లావాదేవీలపై డిస్కౌంట్ లభిస్తుంది. అమెజాన్–ఐసీఐసీఐ బ్యాంక్ క్రెడిట్ కార్డుదారులకు 5 శాతం వరకు క్యాష్‌బ్యాక్, ఎక్స్ఛేంజ్ ఆఫర్స్, నో–కాస్ట్ ఈఎంఐ వంటివి ఉండనున్నాయి.

ముఖ్యంగా ఈ సేల్‌లో శాంసంగ్ ఫోన్లను అమెజాన్ తన మైక్రోసైట్‌లో హైలైట్ చేస్తోంది. శాంసంగ్ గెలాక్సీ ఎస్24 అల్ట్రా, గెలాక్సీ ఏ55 5జీ, గెలాక్సీ ఎం35 5జీ ఫోన్లను డిస్కౌంట్‌లో అందిస్తామని ప్రకటించింది. అయితే వాటి ధరలను మాత్రం వెల్లడించలేదు. వీటితో పాటు షావోమి, ఒప్పో, వివో ఫోన్లు సైతం తక్కువ ధరకే అందించనున్నారు. ఐఫోన్ 15, వన్‌ప్లస్ 13ఆర్, వన్‌ప్లస్ నార్డ్ 4, ఐకూ నియో 10ఆర్ వంటి ఫోన్లపై ఆఫర్లు లభించనున్నాయి. వీటితో పాటు ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌టీవీలు, ఎయిర్ కండీషన్లపైనా ఆఫర్లు ఉండబోతున్నాయి. సేల్ ప్రారంభం కాబోయే కొన్ని గంటల ముందు మరిన్ని ఆఫర్లు వివరాలు వెల్లడి కానున్నాయి.

## దేశీయ విమాన ప్రయాణికుల్లో 8.79% వృద్ధి

**మార్చిలో 1.45 కోట్ల మందికి సేవలు: డీజీసీఏ**



దిల్లీ: భారతీయ విమానయాన సంస్థలు ఈ ఏడాది మార్చిలో 1.45 కోట్ల మందిని తమ గమ్యస్థానాలకు చేర్చాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 8.79 శాతం అధికమని శనివారం విడుదలైన అధికారిక గణాంకాలు పేర్కొన్నాయి. గత ఏడాది మార్చిలో విమానయాన సంస్థలు మొత్తం 1.33 కోట్ల మందికి సేవలను అందించాయి. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) దేశీయ ప్రయాణికులకు సంబంధించి తన నెలవారీ నివేదికలో ఈ వివరాలు తెలిపింది. దీని ప్రకారం ఈ ఏడాది మార్చిలో..

ఇండిగో 93.1 లక్షల మంది ప్రయాణికులకు సేవలను అందించింది. 64 శాతం మార్కెట్ వాటాను సాధించింది.

ఎయిర్ ఇండియా గ్రూపు (ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్) 38.8 లక్షల మంది ప్రయాణికులను చేరవేసింది. దీని మార్కెట్ వాటా 26.7 శాతంగా ఉంది.

ఇతర రెండు విమానయాన సంస్థలు ఆకాశ ఎయిర్ 7.2 లక్షలు (5% మార్కెట్ వాటా), స్పైస్‌జెట్ 4.8 లక్షల (3.3 శాతం మార్కెట్ వాటా) మంది ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేర్చాయి.

### కచ్చితమైన వేళల పాటింపులో ఇండిగో టాప్

కచ్చితమైన వేళలను (ఓటీపీ) పాటించడంలో ఇండిగో 88.1 శాతంతో తొలి స్థానం సాధించింది. ఆకాశ ఎయిర్ 86.9 శాతంతో రెండో స్థానంలో నిలిచింది. ఎయిర్ ఇండియా గ్రూపు 82 శాతం, స్పైస్‌జెట్ 72.1 శాతంతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. హైదరాబాద్, దిల్లీ, బెంగళూరు, ముంబయిలోని నాలుగు మెట్రో విమానాశ్రయాలను ఓటీపీ పరిశీలన కోసం తీసుకున్నారు.

# ఆర్ఐఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా అనంత్




దిల్లీ: ముకేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్(ఆర్ఐఎల్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమించారు. మే 1 నుంచి అయిదేళ్ల పాటు ఆయన ఈ పదవిలో ఉంటారని కంపెనీ తెలిపింది. వారసత్వ ప్రణాళికలో భాగంగా 2023 ఆగస్టులో ముకేశ్ అంబానీ తన ముగ్గురు పిల్లలు ఈశా, ఆకాశ్, అనంత్‌లను ఆర్ఐఎల్ బోర్డులో నాన్–ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లుగా చేర్చుకున్నారు. ముకేశ్ పెద్ద కుమారుడు ఆకాశ్ 2022 జూన్ నుంచి టెలికాం అనుబంధ సంస్థ జియో ఇన్ఫోకామ్ ఛైర్మన్‌గా ఉన్నారు. ఈశా రిటైల్, ఇ–కామర్స్, లగ్జరీ వ్యాపారాలను చూస్తున్నారు. అనంత్ కొత్త ఇంధన వ్యాపారాలను చూసుకుంటున్నారు. టెలికాం, రిలయన్స్ డిజిటల్ ప్రోపర్టీస్‌ను నిర్వహిస్తున్న జియో ప్లాట్‌ఫామ్స్, రిలయన్స్ రిటెయిల్ బోర్డుల్లో ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ నెల 25న జరిగిన ఆర్ఐఎల్ డైరెక్టర్ల బోర్డు సమావేశంలో మానవ వనరులు, నామినేషన్–రెమ్యునరేషన్ కమిటీ సిఫారసు మేరకు అనంత్ అంబానీని నాన్–ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నుంచి పూర్తి కాల డైరెక్టర్‌గా తీసుకుని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా 2025 మే 1 నుంచి అమల్లోకి వచ్చేలా నియమించినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు కంపెనీ సమాచారమిచ్చింది.

అనంత్ అంబానీ బ్రౌన్ విశ్వవిద్యాలయం నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. రిలయన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియామకం అయిన ముకేశ్ వారసుల్లో ఈయనే తొలి వ్యక్తి. 2022 ఆగస్టులో రిలయన్స్ ఎనర్జీ వర్టికల్ నాయకుడిగా అనంత్‌ను నియమించారు. 2020 మార్చి నుంచి జియో ప్లాట్‌ఫామ్స్ బోర్డులో ఉన్నారు. 2022 మే నుంచి రిలయన్స్ రిటెయిల్ వెంచర్స్ బోర్డులో ఉన్నారు. 2021 జూన్ నుంచి రిలయన్స్ న్యూ ఎనర్జీ, రిలయన్స్ న్యూ సోలార్ ఎనర్జీ బోర్డుల్లోనూ ఉన్నారు. 2022 సెప్టెంబరు నుంచి రిలయన్స్ ఫౌండేషన్ బోర్డులో కొనసాగుతున్నారు.




## అరబిందో రొమ్ము కేన్సర్ మందుకు త్వరలో ఐరోపాలో తుది అనుమతి

హైదరాబాద్: అరబిందో ఫార్మాకు పూర్తి అనుబంధ సంస్థ అయిన క్యూరాటెక్ బయోలాజిక్స్, ఐరోపాలో ఒక రొమ్ము కేన్సర్ ఔషధానికి 'మార్కెటింగ్ ఆథరైజేషన్' సంపాదించనుంది. డజుబ్లిస్ (150 ఎంజీ పౌడర్) అనే ఈ మందు ట్రస్టుజుమ్యాబ్ బయోసిమిలర్ కావటం గమనార్హం. దీన్ని హెర్2– పాజిటివ్ మెటాస్టాటిక్ రొమ్ము కేన్సర్ బాధితుల్లో చికిత్స కోసం వినియోగిస్తారు. ఈ మందును విక్రయించటానికి 'మార్కెటింగ్ ఆథరైజేషన్' కోరుతూ క్యూరాటెక్ బయోలాజిక్స్ దాఖలు చేసిన దరఖాస్తుకు ఐరోపా ఔషధ నియంత్రణ సంస్థ (ఈఎంఏ)కు చెందిన కమిటీ ఆఫ్ మెడిసినల్ ప్రోడక్ట్స్ ఫర్ హ్యూమన్ యూజ్ (సీహెచ్ఎంపీ) సానుకూలత వ్యక్తం చేసింది. ఈ సిఫారసు ప్రకారం ఈ ఏడాది జులై నెలలో ఈఎంఏ నుంచి తుది అనుమతి లభిస్తుందని అరబిందో ఫార్మా అంచనా వేస్తోంది. అనంతరం ఐరోపా సమాఖ్య(ఈయూ) సభ్య దేశాల్లో ఈ మందును విడుదల చేయటానికి అరబిందో ఫార్మా సన్నద్ధం అవుతుంది. ఐరోపా దేశాల్లో ఇది ఈ కంపెనీకి నాలుగో బయోసిమిలర్ ఔషధం అవుతుంది. గత ఏడాది నవంబరులో బెవాకోల్వా (బెవాసిజుమ్యాబ్ బయోసిమిలర్) మందుకు అనుమతి సంపాదించిన విషయం విదితమే. కేన్సర్ వ్యాధి చికిత్సలో బయోసిమిలర్ ఔషధాల పాత్ర ఎంతో కీలకంగా మారినట్లు, అందువల్ల ఈ విభాగంలో కొత్త ఔషధాలను విడుదల చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు అరబిందో ఫార్మా వివరించింది. ఆంకాలజీ, ఇమ్యునాలజీ చికిత్స విభాగంలో 2030 నాటికి తక్కువ ధరలో, అత్యంత నాణ్యమైన 10 బయోసిమిలర్ ఔషధాలను విడుదల చేయాలనేది తమ లక్ష్యమని అరబిందో ఫార్మా ఎండీ నిత్యానంద రెడ్డి పేర్కొన్నారు.



## ప్రోత్సాహకాలు పొందాలంటే డిజైన్ బృందాలు ఏర్పాటు చేయాలి

**ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీదార్లకు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ సూచన**

దిల్లీ: ప్రభుత్వ ప్రోత్సాహక పథకాన్ని పొందాలంటే ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీదార్లు డిజైన్ బృందాలను ఏర్పాటు చేసి, వారి పనిలో సిక్స్ సిగ్మా స్థాయిని సాధించాల్సి ఉంటుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ శనివారం వెల్లడించారు. ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ దీన్ని అధికారిక ప్రమాణంగా చేయదని, ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ మ్యానుఫ్యాక్చరింగ్ స్కీమ్ (ఈసీఎంఎస్) కోసం దరఖాస్తులను ఆమోదించే ముందు ఈ అంశాలను పరిశీలిస్తుందని మంత్రి తెలిపారు. వివిధ పద్ధతులు, టూల్స్ వినియోగించడం ద్వారా నాణ్యత సామర్థ్యాన్ని పెంచడం, లోపాలను తగ్గించడం సిక్స్ సిగ్మా లక్ష్యమని పేర్కొన్నారు. ఈ పథకంలో చేరాలనుకునే ప్రతి ఒక్కరూ ఒక డిజైన్ బృందాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అధికారిక ఆమోదం కోసం దీన్ని ప్రమాణంగా చేర్చకపోయినా, అనధికారిక ఆమోదం కోసం దీన్ని పరిగణనలోకి తీసుకుంటామని వెల్లడించారు. ఈసీఎంఎస్ మార్గదర్శకాలపై ఒక పోర్టల్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆయన ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీదార్లతో మాట్లాడారు. కొన్ని కంపెనీలు 5,000 మంది ఇంజినీర్లతో డిజైన్ బృందాలను ఏర్పాటు చేశాయని తెలిపారు. ఒకవేళ ఎవరికైనా డిజైన్ బృందం లేకపోతే, అన్ని పారామితులను పూర్తి చేసినా వారిని ప్రోత్సాహక పథకానికి ఎంపిక చేయమని తేల్చిచెప్పారు. కచ్చితంగా డిజైన్ బృందాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

# భారత్‌లో పని చేసే జనాభా కంటే వేగంగా ఉద్యోగాల పెరుగుదల: ప్రపంచ బ్యాంకు




భారత్‌లో ఉద్యోగాల పెరుగుదలకు సంబంధించి ప్రపంచ బ్యాంకు నివేదిక విడుదల చేసింది. భారత్‌లో ఉద్యోగాల పెరుగుదలలో సానుకూల పవనాలు వీస్తున్నట్లు అందులో పేర్కొంది. 2021-22 నుంచి దేశంలోని కార్మిక మార్కెట్ డైనమిక్స్‌లో గణనీయమైన మార్పు చోటుచేసుకుందని తెలిపింది. ఇందులోభాగంగా నాటి నుంచి పని చేసే జనాభా కంటే వేగంగా ఉద్యోగాల సృష్టి జరుగుతోందని వెల్లడించింది. అంతేకాకుండా శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యం వృద్ధి చెందుతున్నట్లు నివేదించింది.

గత మూడేళ్లుగా దేశంలో పనిచేసే జనాభా కంటే ఉపాధి వృద్ధి స్థిరంగా ఉందని.. పట్టణాలలో నిరుద్యోగ స్థాయిలు తగ్గుతున్నాయని నివేదిక వెల్లడించింది. 2017-18 ఆర్థిక సంవత్సరం తర్వాత పట్టణ నిరుద్యోగం తగ్గుతూ వచ్చి 2021-22 నాటికి అత్యల్పంగా 6.6 శాతానికి పడిపోయిందని ప్రపంచ బ్యాంకు పేర్కొంది. కరోనా మహమ్మారి తర్వాత దేశంలో ఉపాధి అవకాశాలు మళ్లీ మెరుగుపడ్డాయనడానికి ఇదే సంకేతమని నిపుణులు పేర్కొంటున్నారు.

ఉపాధి రంగంలో గమనించదగ్గ మార్పుల్లో ఉద్యోగాల కోసం గ్రామీణప్రాంతాల ప్రజలు అధికంగా పట్టణ ప్రాంతాలకు వలసలు రావడం పెరిగినట్లు నివేదిక పేర్కొంది. 2018-19 తర్వాత మొదటిసారిగా.. ఉపాధి కోసం గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు పురుషుల వలసలు గణనీయంగా పెరిగాయని తెలిపింది. అయితే గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు అధికంగా శ్రామిక శక్తిలోకి, ముఖ్యంగా వ్యవసాయ వృత్తిలోకి ప్రవేశిస్తున్నట్లు వివరించింది. మహిళా ఉద్యోగ రేటు పెరుగుతున్నప్పటికీ వేతనాల్లో లింగ అసమానతలు అలాగే ఉన్నాయని పేర్కొంది.









# ఫ్రెండ్స్‌లా ఎలా ఉండాలో చెప్పిన అత్తలు..!

చాలామంది అత్తాకోడళ్ల మధ్య.. పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. కోడలు తన కొడుకును ఎక్కడ కొంగున కట్టేసుకుంటుందనే భయం అత్తది, అత్తగా తనపై పెత్తనం చెలాయిస్తుందన్న ఆందోళన కోడలిది. వీళ్లిద్దరి మధ్య ఎప్పుడూ కోల్డ్ వార్ జరుగుతూనే ఉంటుంది. కొందరి ఇళ్లల్లో ఈ ఇద్దరి మధ్య పెద్ద.. పెద్ద యుద్ధాలే జరిగిపోతాయ్. కష్టమైన, క్లిష్టమైన కోడళ్లతో ఎలా మెలగాలో.. అత్తలు మనతో పంచుకున్నారు.

వేరేగా ఉండమన్నా.. నా కొడుకుది లవ్ మ్యారేజ్. అతను వేరే కులానికి చెందిన అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు.. కాబట్టి మా సిద్ధాంతాలు, సంస్కృతులు చాలా భిన్నంగా ఉంటాయి. నేను, నా కొడలిని కూతురుగానే భావించాను.. ఎందుకంటే నాకు ఇద్దరు కొడుకులు, నాకు అమ్మాయిలు లేరు. మా ఇంటికి ఒక అమ్మాయి రావడం చాలా సంతోషంగా అనిపించింది. కానీ నాకు స్వార్ధపూరిత, ఇమ్‌మెచ్యూర్ కోడలు దొరికిందని కొన్ని రోజుల్లోనే అర్థమైంది. తన చాలా తప్పులు చేసేది, అవి తప్పులని మా అబ్బాయికి కూడా తెలుసు. కానీ, తనను ఏమి అనేవాడు కాదు. ఒక రోజు నాకు, మా కోడలికి పెద్ద గొడవ జరిగింది. ఆ గొడవ ఎంతకు దారి తీసిందంటే.. మా అబ్బాయిని వేరేగా ఉండమని చెప్పేంతగా. తనను వేరే కాపురం వెళ్లమనడం చాలా బాధగా అనిపించింది. కానీ ఇది ఒక్కటే మార్గం. ఇప్పటికి 7 సంవత్సరాలు గడిచాయి. మా అబ్బాయి పెళ్లి అయ్యి 7 ఏళ్లు అయింది. ఇప్పుడు మేము చాలా ఫ్రెండ్లీగా ఉంటున్నాం.

టిట్ ఫర్ టాట్.. మొదట్లో నా కోడలు, నేను చాలా ఫ్రెండ్లీగా ఉండేవాళ్లం. తను నాతో చాలా మంచిగా ప్రవర్తించేది.. రాను రాను తన అసలు రంగు





చూపించడం మొదలుపెట్టింది. మా అబ్బాయి ఇంట్లో లేనప్పుడు వింతగా ప్రవర్తించేది. తను నన్ను నా భర్తను మా ఇంటికి కొంతదూరంలో ఉన్న మా చిన్న ఫ్లాట్‌కు పంపించేయాలని అనుకుంటుందని నేను గ్రహించాను. తను ఈ విషయం డైరెక్ట్‌గా మాకు చెప్పి ఉంటే నేను కచ్చితంగా ఒప్పుకునే దాన్ని, మా పిల్లలకు స్వేచ్ఛ ఇవ్వడం నాకు ఇష్టమే. కానీ, తన ప్రవర్తన నాకు నచ్చలేదు.. దీంతో నేను తను ఎలా యాక్ట్ చేస్తుందో, నేను అలాగే నటించడం స్టార్ట్ చేసేతత. రెండు వారాల తర్వతా.. తను తిరిగి ట్రాక్‌లోకి వచ్చింది

**మా అబ్బాయి ఇంట్లో లేనప్పుడు వింతగా ప్రవర్తించేది. తను నన్ను నా భర్తను మా ఇంటికి కొంతదూరంలో ఉన్న మా చిన్న ఫ్లాట్‌కు పంపించేయాలని అనుకుంటుందని నేను గ్రహించాను. తను ఈ విషయం డైరెక్ట్‌గా మాకు చెప్పి ఉంటే నేను కచ్చితంగా ఒప్పుకునే దాన్ని, మా పిల్లలకు స్వేచ్ఛ ఇవ్వడం నాకు ఇష్టమే. కానీ, తన ప్రవర్తన నాకు నచ్చలేదు..**

కూతురిలా చూసుకోవాలి.. కోడలితో అంత ఈజీ కాదని నా ఫ్రెండ్స్ నన్ను హెచ్చరించే వాళ్లు. కానీ, నేను కోడలితో చాలా సంతోషంగా ఉన్నాను. నా కోడలిని నేను కూతురిలా చూసుకుంటా, తను కూడా నాతో ఫ్రెండ్లీగా ఉంటుంది. తను మాతో చాలా హ్యాపీగా ఉంటుంది. చిన్నచిన్న తగాదాలను, సమస్యలను వెంటనే పరిష్కరిస్తుంది. ఇంటి ఆనందానికి సంబంధించిన అంశాలను చూసుకుంటుంది.

తప్పుగా అర్థం చేసుకున్నా.. నా కోడలు ఇంటికి వచ్చిన తర్వాత మా అమ్మాయి, నా భర్త, మా మామగారు కూడా తన పార్టీకి మారిపోయారు. ఆమె ఏమి చేసినా తెగ పొగిడేవారు, తన వంటను ఎంతో మెచ్చుకునేవారు.. నా వంట కంటే కూడా బాగుందని పొగడ్తలతో ముంచేసేవారు. నాక చాలా అసూయగా అనిపించింది. రెండుమూడేళ్లు నేను ఆమెను అసహ్యించుకున్నాను. ఆ తర్వాత.. నా తప్పు నాకు తెలిసొచ్చింది. నేను ఆమెతో పోటీ పడటం మానేయాలని నిర్ణయించుకున్నాను. ఈ మార్పు మా బంధాన్ని బలపరిచింది. నా ఒత్తిడి దూరం అయ్యింది, నేను రిలాక్స్ అయ్యాను. ఇప్పుడు మేమిద్దరం తల్లీకూతుర్లులా మారిపోయాం.

కౌన్సెలింగ్ వెళ్లాం.. మొదట్లో నాకు, నా కోడలికి అంతగా పడేది కాదు. నాకు ఇంట్లో నెగిటివిటీ ఉండటం ఇష్టం ఉండదు. నేను సమస్య పరిష్కారం కోసం గూగుల్ చేశాను. నేను ఆమెతో కలిసి కౌన్సెలింగ్‌కి వెళ్లాలని నిర్ణయించుకున్నాను. దీనికి ఆమె కూడా ఒప్పుకుంది. మేమిద్దరం కలిసి కౌన్సెలింగ్ సెషన్‌లకు వెళ్లాం. ఇప్పుడు మా మధ్య బంధం చాలా అందంగా మారింది. మా మధ్య అపార్థాలు తొలగాయి. ఇప్పుడు నేను, నా కోడలు చాలా హ్యాపీగా ఉంటున్నాం.

# జలుబు, ఫ్లూ తగ్గించే.. యోగాసనాలు ఇవే..!









వానాకాలం అంటే చాలా మంది ఇష్టపడుతూ ఉంటారు. అయితే, వర్షాకాలం వ్యాధుల కాలం అంటుంటారు. ఈ సీజన్‌లో అనారోగ్యాలూ ఎక్కువగా ఇబ్బంది పెడుతూ ఉంటాయి. వర్షాకాలంలో జలుబు, దగ్గు, గొంతు నొప్పి, ఫ్లూ వంటి సమస్యలతో చాలా మంది బాధపడుతుంటారు. నిజానికి, ఈ కాలంలో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. దీంతో అనారోగ్యాల ఎక్కువగా ఎటాక్ చేస్తూ ఉంటాయి. జలుబు, ఫ్లూ నుంచి ఉపశమనం పొందడానికి హెర్బల్ డ్రింక్స్ తీసుకోవడం, ఎసెన్షియల్ ఆయిల్స్ వాసన పీల్చడం, సూప్స్ తాగడం వంటి ఇంటి చిట్కాలను ఫాలో అవుతూ ఉంటాయి. జలుబు, ఫ్లూ నుంచి త్వరగా బయటపడటానికి యోగాసనాలు ఎఫెక్టివ్‌గా సహాయపడతాయని నిపుణులు అంటున్నారు. బాలాసనం వేయడానికి ముందుగా చాప మీద మోకాళ్లపై కూర్చోవాలి. ఆ తర్వాత పాదాలపై పిరుదులు ఆనించి కూర్చోవాలి. దీన్ని వజ్రాసనం అంటారు. తరువాత నుదురు భాగం నేలకు తగిలేలా ముందుకు వంగాలి. తర్వాత రెండు చేతులను ముందుకు పూర్తిగా చాపాలి. అలా ఉండి నెమ్మదిగా శ్వాస తీసుకోవడం, వదలడం చేయాలి. శరీరాన్ని పూర్తిగా విశ్రాంతి తీసుకోనివ్వాలి. శ్వాస మీద ఏకాగ్రత పెట్టి, శరీరం, మనస్సు ఫ్రీ చేసుకోవాలి. ఈ భంగిమలో కనీసం 30 సెకన్ల పాటు ఉండాలి.

ఉష్ట్రాసనం.. ఉష్ట్రాసనం వేయడానికి ముందుగా.. మోకాళ్ల మీద కూర్చోవాలి. రెండు పాదాలనూ కిందికి అదిమిపెట్టి ఉంచాలి. వీలైనంత వెనక్కి వంగి, కుడి చేత్తో కుడి కాలి మడమని, ఎడమ చేత్తో ఎడమకాలి మడమని పట్టుకోవాలి. తలను పూర్తిగా కిందికి వంచేయాలి. ఈ భంగిమలో ఎంతసేపు ఉండగలిగితే అంతసేపు ఉండొచ్చు. కనీసం 20 క్షణాలు ఉండగలిగితే మంచిది. తర్వాత మెల్లగా రిలాక్స్ అవ్వాలి. ఇలా రెండు, మూడుసార్లు చేయాలి. హలాసనం.. హలాసనం వేయడానికి ముందుగా మ్యాట్‌పై పడుకుని నేలపై చేతులను సమాంతరంగా చాపాలి. ఇప్పుడు నడుము కింది భాగాన్ని మెల్లిగా పైకి లేపుతూ తలకు పై భాగంలో కాళ్లను తీసుకువచ్చే ప్రయత్నం చేయాలి. ఈ భంగిమలో కనీసం 10 సెకన్లు ఉండి.. సాధారణ స్థితికి రండి. భుజంగాసనం.. భుజంగాసనం వేయడానికి ముందుగా.. బోర్లా పడుకొని శరీరం మొత్తాన్ని పూర్తిగా స్ట్రెచ్ చేయాలి. రెండు పాదాల వేళ్లు, మడమలు తాకేలా చూసుకోవాలి. అరచేతులను ఛాతీ పక్కలకు తీసుకొచ్చి, నేలకు ఆనించాలి. శ్వాసను తీసుకుంటూ నెమ్మదిగా తల, ఛాతీని పైకి లేపాలి. మోచేతులు నేలకు ఆని ఉండేలా చూసుకోవాలి. కొద్దిసేపయ్యాక శ్వాసను వదులుతూ తిరిగి మామూలు స్థితికి రావాలి.

# నానబెట్టి తింటే సమస్యలు దూరం









డ్రైఫ్రూట్స్ తినడం వల్ల ఎన్నో హెల్త్ బెనిఫిట్స్ ఉంటాయని అందరికీ తెలుసు. డ్రైఫ్రూట్స్ తినడం వల్ల కలిగే బెనిఫిట్స్‌తో వాటిని తీసుకుంటారు. ఫిగ్స్‌ని తీసుకోవడం వల్ల చాలా హెల్త్ బెనిఫిట్స్ ఉంటాయి. ఈ పండ్లలో మనకి అవసమయ్యే ప్రత్యేక పోషకాలు ఉన్నాయి. వీటిని రెగ్యులర్‌గా తీసుకుంటే చాలా లాభాలు ఉన్నాయి. అవేంటంటే..


సంతానోత్పత్తి.. ఇక స్త్రీలలో సంతానోత్పత్తిని పెంచడంలోనూ అంజీర్ హెల్ప్ చేస్తుంది. మెనోపాజ్ తర్వాత ఎదురయ్యే చాలా సమస్యల్ని దూరం చేయడంలో అంజీర్ పండ్లు హెల్ప్ చేస్తాయి. ఇందులో జింక్, మెగ్నీషియం, ఐరన్ పుష్కలంగా ఉంటాయి. అలాగే నానబెట్టిన అంజీర్ పండ్లని తినడం వల్ల హార్మోన్ల మార్పులకి చాలా మంచిది.

మలబద్ధకం.. మలబద్ధకం నుంచి రిలీఫ్ పొందడంలో ఫిగ్స్ హెల్ప్ చేస్తాయి. ఉదయాన్నే ఖాళీ కడుపుతో నానబెట్టిన అంజీర్ పండ్లని తీసుకుని ఆ నీటిని తీసుకోవడం వల్ల మలబద్ధకం దూరమవుతుంది. ఫిగ్స్‌లోని ఫైబర్ మలబద్ధకాన్ని దూరం చేస్తుంది. అంతే కాదు, వీటిని తీసుకోవడం వల్ల అజీర్ణం కూడా దూరమవుతుంది.

షుగర్ కంట్రోల్.. అంజీర్‌లో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. ఇది ఆరోగ్యానికి చాలా మంచిది. పొటాషియం బ్లడ్ షుగర్ లెవల్స్‌ని కంట్రోల్ చేస్తుంది. ముఖ్యంగా టైప్ 2 దయాబెటిస్‌ని నియంత్రించడంలో హెల్ప్ చేస్తుంది. అంతేకాదు, ఇందులోని ఒమేగా 6 ఫ్యాటీ యాసిడ్, ఫినాల్ గుండె ఆరోగ్యానికి మంచిది.

చర్మానికి మంచిది.. అంజీర పండ్లని నానబెట్టి ఉదయాన్నే తిని, ఆ నీటిని తాగితే బాడీలోని టాక్సిన్స్ దూరమవుతాయి. ఇది చర్మాన్ని కాంతివంతం చేస్తుంది. మన చర్మ సమస్యల్ని చాలా వరకూ దూరం చేస్తుంది. దీంతో మీ అందం పెరుగుతుంది. బరువు తగ్గడానికి.. చాలా మంది బరువు తగ్గడానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తారు. అలాంటి వారు ఈ పండ్లని తినడం మంచిది. ఫైబర్ పుష్కలంగా ఉండే అంజీర్ పండ్లని తినడం వల్ల బరువు తగ్గేందుకు హెల్ప్ చేస్తుంది. అయితే, సరైన మోతాదులో తీసుకోవాలి. ఎక్కువగా తీసుకుంటే బరువు పెరిగే అవకాశం కూడా ఉంది.

# కాఫీ ఇలా తాగితే బరువు తగ్గుతారట..







బరువు తగ్గడానికి చాలామంది ట్రై చేస్తారు. కానీ, హెల్దీ వేలో ఉంటే ఇంకా బావుంటుంది. అలాంటి ఓ హెల్దీ వెయిట్‌లాస్ డ్రింక్ చూద్దాం.బటర్ కాఫీ, బుల్లెట్ ప్రూఫ్ కాఫీలు. వెయిట్‌లాస్ డ్రింక్స్‌లో ఇవి ఒకటి. ఇలాంటి డ్రింక్స్ మీరు బరువు తగ్గడానికి హెల్ప్ చేస్తాయి. ఇలాంటి డ్రింక్స్‌లోబ్రకోలీ కాఫీ కూడా ఒకటి. దీనిని తీసుకోవడం వల్ల బరువు తగ్గుతారట. మరి ఇది ఎలా తయారుచేస్తారు..


బ్రకోలీలో పోషకాలు.. బ్రకోలీలో ఫైబర్, విటమిన్స్ పుష్కలంగా ఉంటాయి. ఇందులో పీచుపదార్థం బాడీలోని కొవ్వుని కరిగించి బరువు కంట్రోల్‌లో ఉంటుంది. దీనిని కాఫీ రూపంలో తీసుకోవచ్చు. ఇందులో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. కేలరీలు తక్కువగా ఉంటాయి. ఇందులో విటమిన్ ఎ, విటమిన్ సి, సోడియం, పొటాషియం, కార్బోహైడ్రేట్స్, ఫైబర్స్, ప్రోటీన్, కాల్షియం, ఐరన్‌లు ఉంటాయి. బెనిఫిట్స్..

బ్రోకలీలోని కాల్షియం ఎముకలు, దంతాల ఆరోగ్యాన్ని మెరుగ్గా చేస్తాయి. ఇందులో పీచుపదార్థం ఎక్కువగా ఉంటుంది. గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండడం వల్ల బరువు తగ్గడంతో పాటు రక్తంలో చక్కెర స్థాయిలని తగ్గించి మధుమేహాన్ని అదుపులో ఉంచుతుంది. బ్రకోలీలో ఉండే యాంటీ క్యాన్సర్ గుణాలు క్యాన్సర్‌ని తగ్గిస్తుంది. బ్రకోలీని గుండె జబ్బులు, క్యాన్సర్ నుండి మిమ్మల్ని రక్షిస్తుంది.

# ఫోన్ ఎక్కువగా వాడుతున్నారా..?







ప్రపంచ జనాభాతో పోలిస్తే ప్రపంచవ్యాప్తంగా ఉన్న సెల్‌ఫోన్‌ల సంఖ్యే ఎక్కువంట. అంతలా పెరిగిపోయింది ఫోన్ వాడకం. ఫోన్ వచ్చిన కొత్తలో.. కేవలం మాట్లాడుకోవడం కోసమే వాడేవారు. మరి ఇప్పుడు.. బ్యాంక్ లవాదేవీలు, షాపింగ్, సినిమాలు చూడటం, ఫోటోలు, వీడియోలు తీయడం ఇలా దాదాపు అన్ని పనులు ఫోన్‌తోనే జరిగిపోతున్నాయి. అయితే చాలామందికి ఫోన్ వాడకంలో కంట్రోల్‌లో ఉండదు. పొద్దున లేచింది మొదలు.. రాత్రి పడుకునే వరకూ ఫోన్ వాడుతూనే ఉంటారు. సెల్‌ఫోన్ చేతిలో ఉంటే పక్కన ఉన్నవారితో అవసరమే ఉండదు. అసలు చుట్టూ ఏం జరుగుతుందో కూడా పట్టించుకోరు. ఇలా విచ్చలవిడిగా ఫోన్ వాడితే.. అనేక ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

కళ్లు అలసిపోతాయ్.. ఫోన్ ముందేసుకుని.. గంటల గంటలు గడిపేతే.. కళ్లు అలసిపోతాయ్. అదే పనిగా డిజిటల్ స్క్రీన్ చూడటం వల్ల కళ్లు పొడిబారడం, అస్పష్టమైన దృష్టి, తలనొప్పి, అలసట వంటి లక్షణాలకు దారితీస్తుంది. ఫోన్ అతిగా వాడితే.. దృష్టి సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు.

ఫోన్ పక్కన పెట్టుకుని పడుకుంటున్నారా.. అయితే వెరీ రిస్క్.. నిద్రలేమి.. ఫోన్ అతిగా వాడితే.. నిద్రలేమి సమస్య ఎదురయ్యే అవకాశం ఉంది. రాత్రి పడుకునేటప్పుడు ఫోన్ చూస్తే మొబైల్ స్క్రీన్ నుంచి వచ్చే బ్లూలైట్ మెలటోనిన్ ఉత్పత్తికి ఆటంకం కలిగిస్తుంది. ఈ హార్మోన్ నిద్ర రావటంలో సహాయపడుతుంది. కాంతి ఎక్కువసేపు కంటిపై పడటం వల్ల నిద్రలేమి సమస్య ఎదురవుతుంది. నిద్రలేమి అనేక తీవ్ర అనారోగ్యాలకు దారితీస్తుంది.

మెడ, వెన్నునొప్పి..రోజంతా ఫోన్ వాడితే.. మెడ, వెన్నెముక ఎక్కువ సేపు వంగే ఉంటాయి. ఇది దీర్ఘకాలిక వెన్నెముక సమస్యలతో పాటు మెడ, వెన్నునొప్పికి కారణమవుతుంది.

సెల్‌ఫోన్ ఎల్బో.. చేతిలో సెల్‌ఫోన్‌ను వాడుతుంటే సెల్‌ఫోన్ ఎల్బో వచ్చే అవకాశం ఉంది. సెల్‌ఫోన్ మాట్లాడేటప్పుడు చేతిని మలుస్తూ ఉంటారు. ఎక్కువగా వాడినప్పుడు కూడా చేతిని ఒకే కోణంలో ఉంచుతుంటారు. దీని వల్ల మోచేయి దగ్గర ఉండే అల్నార్ నరం ఒత్తిడికి గురౌతుంది. దీంతో చేతికి తిమ్మిర్లు వస్తుంటాయి. మణికట్టు నుంచి మొదలు మోచేయి వరకూ నరం నొప్పి వస్తుంది. దీని నుంచి తప్పించుకోవాలంటే ఫోన్ మాట్లాడేటప్పుడు ఎక్కువ సమయం ఒకే చేతితో పట్టుకోకూడదు.

వేళ్ల నొప్పి.. ఫోన్‌లో ఎక్కువసేపు టైప్ చేయడం, స్వైప్ చేయడం, పట్టుకోవడం వల్ల మన మణికట్టు, వేళ్లు, బొటనవేళ్లలో స్నాయువు, కార్పల్ టన్నెల్ సిండ్రోమ్ వంటి రిపీట్ స్ట్రెయిన్ ఇంజరీస్ ఏర్పడవచ్చు.

మానసిక ఆరోగ్యం దెబ్బతింటుంది.. పొద్దునే లేచింది మొదలు వివిధ సమాచారం కోసం వెతకటం, వాట్సప్‌లో మేసేజ్‌లు ఇలాంటివి ఫోన్‌లో వెతుకుతూ ఉంటారు. ఈ ప్రభావం మానసిక స్థితిపైనా ప్రతికూలంగా ఉంటుందని అధ్యయనాలు చెప్తున్నాయి. ఇది ఒత్తిడి, ఆందోళన, (తప్పిపోతాననే భయం) వంటి సమస్యలు ఎదురవుతాయి. మనల్ని మనం ఇతరులతో పోల్చుకోవడం, నిరంతరం ప్లగ్ ఇన్ చేయడం మన మానసిక ఆరోగ్యాన్ని ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది.

ఉదయం



# హిమాలయాల్లో అఘోర ప్రళయ తాండవం..



నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్లో వస్తున్న 'అఖండ 2' చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి. 'అఖండ' సీక్వెల్‌గా వస్తున్న ఈ సినిమా టీజర్ విడుదలైంది. శివుడి అనుమతి గురించి పవర్ఫుల్ డైలాగ్‌లతో టీజర్ గూస్ బంప్స్ తెప్పిస్తోంది. థమన్ నేపథ్య సంగీతం అద్భుతంగా ఉంది. అఘోర పాత్రలో బాలకృష్ణ రెండు విభిన్న రూపాల్లో కనిపించనున్నారు. సినిమా సెప్టెంబర్ 25న విడుదల కానుంది.

నందమూరి బాలకృష్ణ, డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబోలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'అఖండ 2'. ఇది బాక్సాఫీస్ దగ్గర బ్లాక్ బస్టర్ గా నిలిచిన 'అఖండ' సినిమాకి సీక్వెల్. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ మూవీపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అదే సమయంలో అప్డేట్స్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. వారి కోసం చిత్ర యూనిట్ లేటెస్టుగా 'అఖండ 2' టీజర్ ను రిలీజ్ చేసారు.

"నా శివుడి అనుమతి లేనిదే ఆ యముడు కూడా కన్నెత్తి చూడడు.. నువ్వు చూస్తావా" అంటూ పవర్‌ఫుల్ డైలాగ్ తో ప్రారంభమైన 'అఖండ 2' టీజర్ గూస్ బమ్స్ తెప్పించేలా ఉంది. ఎస్. థమన్ బ్యాగ్రౌండ్ స్కోర్ హైలైట్ గా నిలిచింది.మొదటి భాగానికి మించి ఈ సినిమా ఉంటుందని టీజర్ తోనే శాంపిల్ గా చూపించారు. అఘోర పాత్రను రెండు వేర్వేరు లుక్స్ లో చూపించి ఇంట్రెస్ట్ క్రియేట్ చేసారు. 14 రీల్స్ ప్లస్ బ్యానర్ లో రూపొందుతున్న ఈ చిత్రాన్ని సెప్టెంబరు 25న విడుదల చేయనున్నట్లు స్పష్టం చేసారు.

# ఇంతకంటే ఇంకేం అడగగలను?



నయనతార తాజాగా తన పెళ్లి రోజు సందర్భంగా క్యూట్‌గా పోస్ట్ వేశారు. తన భర్త గురించి, తన ఫ్యామిలీ గురించి చెబుతూ వేసిన పోస్ట్, షేర్ చేసిన ఫోటోలు చూస్తే అందరూ ఫిదా అవ్వాల్సిందే. ఎంత అన్యోన్యమైన దాంపత్యం, కుటుంబం అని అంతా అనుకోవాల్సిందే. ఇక నయన్ వేసిన పోస్ట్, అందులోని ప్రేమ అందరినీ ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం నయన్ ఫ్యామిలీ ఫోటోలు నెట్టింట్లో ట్రెండ్ అవుతున్నాయి.

నయనతార, విఘ్నేశ్ శివన్ డేటింగ్, ప్రేమ, పెళ్లి, పిల్లలు ఇలా ప్రతీ టాపిక్ నేషనల్ వైడ్‌గా ట్రెండ్ అయిన సంగతి తెలిసిందే. నేనూ రౌడీనే అనే మూవీతో ఈ ఇద్దరి మధ్య పరిచయం, స్నేహం మొదలైంది. కొన్నేళ్ల డేటింగ్ కాస్తా ప్రేమగా మారింది. ఇక పెళ్లి వరకు వచ్చే సరికి ఎన్నో వివాదాలు, ఇంకెన్నో ట్విస్టులు వచ్చాయి. మధ్యలో వీరిద్దరి బ్రేకప్ అంటూ వార్తలు రాశారు. ప్రత్యేక పూజలు చేస్తున్నారని రాసుకొచ్చారు. ఇక చివరకు నయన్ పెళ్లి కూడా పెద్ద కాంట్రవర్సీగా మారింది. తిరుమలలో జరిగిన ఫోటో షూట్ కూడా వివాదంగా నిలిచింది. అలా నయన్ పెళ్లి (జూన్ 9) జరిగిన క్షణం నుంచి ఏదో ఒక కాంట్రవర్సీలో ఇరుక్కుంటూనే ఉన్నారు. ఇక ఇప్పుడు తన మ్యారేజ్ యానివర్సరీ సందర్భంగా నయన్ వేసిన పోస్ట్ అందరినీ ఆకట్టుకుంటోంది. మనంలో మనం ఎవరం ఎక్కువగా ప్రేమిస్తామనే విషయంలో ఆశ్చర్యపోతోంటాం.. ఆ ప్రశ్నకు మాత్రం ఎప్పుడూ మన మధ్య సమాధానం దొరకలేదు.. మన బంధం గురించి వివరించలేం.. నువ్వే నా సర్వస్వం, ప్రపంచం.. ఇద్దరం కాస్తా నలుగురం అయ్యాం.. ఇంత కంటే ఎక్కువగా నేనేం అడగలను.. ప్రేమంటే ఏంటో.. ప్రేమ ఎలా ఉండాలో నువ్వే నాకు నేర్పించావు.. చూపించావు.. హ్యాపీ యానివర్సరీ మై పార్ట్నర్ అంటూ నయన్ పోస్ట్ వేశారు.

ఇక నయన్ ప్రస్తుతం వివాదాలతోనే ఎక్కువగా ట్రెండ్ అయ్యారు. నెట్ ఫ్లిక్స్‌లో వచ్చిన మ్యారేజ్ డాక్యుమెంటరీ, దాని మీద ధనుష్ వేసిన కేసు, వాటిపై నయన్ రియాక్ట్ అయిన తీరు.. పరోక్షంగా ధనుష్, నయన్ మధ్య జరుగుతున్న కోల్డ్ వార్ గురించి అందరికీ తెలిసిందే. రీసెంట్‌గా కుబేర ఈవెంట్లో కూడా ధనుష్ పరోక్షంగా కౌంటర్లు వేసినట్టు అనిపించింది. తన మీద కావాలనే కొందరు నెగెటివిటీ స్ప్రెడ్ చేయాలని చూస్తున్నారంటూ ధనుష్ ఆరోపించారు.

అలా నయన్ మాత్రం ఎప్పుడూ ఏదో ఒక కాంట్రవర్సీతో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంటారు. ఇక తాజాగా నయన్ మీద ఉన్న ఓ పెద్ద అపోహ అందరికీ తొలిగిపోయింది. ప్రమోషన్స్‌కి నయన్ రాదు అని అంతా అనుకునేవారు. కానీ చిరు అనిల్ ప్రాజెక్ట్ కోసం నయన్ ప్రమోషన్స్‌లో భాగం అయ్యారు. హీరోయిన్ అనౌన్స్మెంట్ వీడియోతోనే నయన్‌ను ప్రమోషన్‌లోకి అనిల్ రావిపూడి దించి అందరినీ ఆశ్చర్యపోయారు. ఇలా చిరు ప్రాజెక్ట్ కోసం అనిల్ రావిపూడి పడే కష్టం అందరినీ కదిలిస్తోంది. స్టార్టింగ్ నుంచే వెరైటీ ప్రమోషన్స్‌తో అనిల్ అందరినీ ఆకట్టుకుంటున్నారు.

# మోహన్ బాబు ముందు నోరుజారేసిన సప్తగిరి...



మోహన్ బాబు అండ్ టీం కన్నప్ప ప్రమోషన్స్ కోసం బాగానే కష్టపడుతోంది. గుంటూరులో రీసెంట్‌గానే ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో కన్నప్ప టీం అంతా కూడా గుంటూరుకి వెళ్లింది. ఇలా వెళ్లే క్రమంలో ఎయిర్ పోర్టులో ఆసక్తికరమైన ఘటన జరిగింది. సప్తగిరి, మోహన్ బాబు, విష్ణు మధ్య చిన్నపాటి సరదా సంఘటన జరిగింది. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది.

మోహన్ బాబు, మంచు విష్ణు ప్రస్తుతం కన్నప్ప కోసం బాగానే కష్టపడుతున్నారు. జూన్ 27న కన్నప్ప మూవీ రిలీజ్ కాబోతోన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో గుంటూరులో రీసెంట్‌గా ఓ ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఇక మిగిలిన చోట్ల కూడా ఇలాంటి ఈవెంట్లు జరిగేలా ఉన్నాయి. అయితే గుంటూరు ఈవెంట్ కోసం కన్నప్ప టీం అంతా కూడా కలిసి ఎయిర్ పోర్టులో ఇలా కనిపించారు. ఈ క్రమంలో సప్తగిరితో విష్ణు, మోహన్ బాబు ఓ ఆట ఆడుకున్నట్టుగా కనిపిస్తోంది.

అసలే మోహన్ బాబు, మంచు విష్ణు తమ తోటి ఆర్టిస్టులతో చేసే సరదా పనులు, ఫన్ గురించి అందరికీ తెలిసిందే. ఈ క్రమంలో ఎయిర్ పోర్టులో ఇలా సప్తగిరి కనిపించడంతో మంచు విష్ణు కౌంటర్ వేశారు. నువ్వు ఈవెంట్‌కి రావని చెప్పారే? అని మోహన్ బాబు కౌంటర్ వేశారు. ఎవరు అలా చెప్పారు.. ఎప్పుడూ నా మీద పడి ఏడుస్తారు అని సప్తగిరి నవ్వుతూనే కౌంటర్లు వేశారు. ఇక ఆ తరువాత మోహన్ బాబు ఏదో అనడం, సప్తగిరి చేతులు పట్టుకుని మొక్కేశారు.

ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట్లో వైరల్ అవుతోంది. ఎయిర్ పోర్టులో కన్నప్ప టీం విజువల్స్, మోహన్ బాబు, ఆయన చుట్టూ కన్నప్ప ఆర్టిస్టులు కలిసి ఇలా ఎయిర్ పోర్టులో సందడి చేశారు. ఇక గుంటూరులో జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో మోహన్ బాబు, మంచు విష్ణు మాట్లాడిన మాటలు, కన్నప్ప చిత్ర విశేషాల్ని చెప్పిన తీరు అందరినీ ఆకట్టుకున్నాయి. ఇక ప్రభాస్ గురించి మోహన్ బాబు, మంచు విష్ణు ఎంతో గొప్పగా మాట్లాడారు.

కన్నప్ప మీద విష్ణు అయితే ఎంతో నమ్మకంగా ఉన్నారు. అందుకే ఇంకా ఓటీటీ డీల్స్‌ను క్లోజ్ చేయలేదు. తాను ఎంతో కష్టపడి తీసిన చిత్రాన్ని ఓటీటీ సంస్థలకు ఎందుకు ముందుగా చూపించాలి..? వారు చెప్పిన టైంకి ఎందుకు రిలీజ్ చేయాలి? అని విష్ణు ధీమాను వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఇక కన్నప్ప సినిమా మూడు గంటలకు పైడా నిడివితో రానున్నట్టుగా కనిపిస్తోంది. ఇంకా సెన్సార్ కార్యక్రమాలు అయితే పూర్తి కాలేదు. వీఎఫ్ఎక్స్ కోసం భారీగా ఖర్చు పెట్టామని రాజా సాబ్ కంటే బడ్జెట్ ఎక్కువే అయిందని మంచు విష్ణు మాట్లాడిన మాటలు నెట్టింట్లో బాగానే వైరల్ అయ్యాయి. ఇక ఈ మూవీని ముఖేష్ కుమార్ సింగ్ తెరకెక్కించిన సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో ప్రభాస్, మోహన్ లాల్, అక్షయ్ కుమార్ పాత్రలు హైలెట్ అవుతాయని అంటున్నారు.

# సినిమా చూపించను మామా!!

భారతదేశంలో 'సినిమా' అనేది వినోద సాధనం. అయితే ఇటీవల కాలంలో థియేటర్లకు వచ్చే ఆడియన్స్ సంఖ్య క్రమ క్రమంగా తగ్గిపోతూ వస్తోంది. థియేటర్లకు ప్రేక్షకులు ఎందుకు దూరం అవుతున్నారు? ఒకప్పుడు కళకళలాడే థియేటర్లు ఇప్పుడు వెలవెలబోవడానికి కారణాలేంటి? టికెట్ ధరలు, ఓటీటీల హవా, పర్సంటేజ్ విధానంపై వివాదాలు.. వీటన్నిటి మధ్య థియేటర్ల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందా? అసలు నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్ల మధ్య జరుగుతున్న చర్చలేంటి? ఈ సమస్యకు పరిష్కారం దొరికేనా?

'సినిమా'... చీకటి తెరపై వెండి వెలుగులు ప్రసరించి, మనల్ని కనువిందు చేసే ఒక కళారూపం. ఇది కేవలం వినోదాన్ని అందించే సాధనం మాత్రమే కాదు, మన జీవితంలో ఓ భాగం. సినిమా మనల్ని నవ్విస్తుంది.. కన్నీళ్లు పెట్టిస్తుంది.. ఆలోచింపజేస్తుంది.. మూడు గంటలపాటు అన్ని బాధలను మర్చిపోయేలా చేస్తుంది. 'సినిమా' అనేది మన హృదయాలను తాకుతుంది.. మనల్ని భావోద్వేగానికి గురి చేస్తుంది. మన జీవితాలనే ప్రభావితం చేసే శక్తి సినిమాకు ఉంది. గతాన్ని కళ్ళ ముందు నిలబెడుతుంది, వర్తమానాన్ని అందంగా చూపిస్తుంది, భవిష్యత్తును ఊహించేలా చేస్తుంది, మనల్ని సరికొత్త లోకానికి తీసుకెళుతుంది. అందుకే అలాంటి సినిమాని అందించే 'థియేటర్'తో ప్రేక్షకులకు ఒక ఎమోషనల్ బాండింగ్ ఉంటుంది. కానీ ఇటీవల కాలంలో ఆడియన్స్ కు, థియేటర్లకు మధ్య దూరం పెరుగుతోంది. ఒకప్పుడు బిగ్ స్క్రీన్ పై సినిమా చూసి ఎంజాయ్ చేసే జనాలు.. థియేటర్లకు దూరం అవుతున్నారు. ఎల్లప్పుడూ ప్రేక్షకులతో కళకళలాడే సినిమా హాళ్లు, ఇప్పుడు వెలవెలబోతున్నాయి. దీనిపై ఓ ప్రత్యేక కథనం.

సినిమా అనేది ఎన్నో వ్యయ ప్రయాసలతో కూడుకున్న వ్యవహారం. ఒక కథ 'సినిమా'గా రూపొందడానికి, ప్రేక్షకుల ముందుకు రావడానికి మధ్య చాలా పెద్ద ప్రాసెస్ ఉంటుంది. తెర మీద జరిగే కథే అందరికీ కనిపిస్తుంది కానీ, తెర వెనుక జరిగే అసలు తతంగం గురించి సాధారణ ప్రేక్షకులకు తెలియదు. సినిమా తీయడం ఎంత కష్టమో.. దాన్ని థియేటర్లలోకి తీసుకురావడం అంత కంటే కష్టం. నిజానికి మేకర్స్ కు అసలు సినిమా కనిపించేది అక్కడే. కోటాను కోట్లు ఖర్చు చేసి తీసిన చిత్రమైనా.. దాన్ని సరిగ్గా రిలీజ్ చేసుకోలేకపోతే నిర్మాతలకు దిమ్మ తిరిగి బొమ్మ కనిపిస్తుంది.

### తెర వెనుక ఇంత 'కథ' ఉందా?

సినిమా కోసం 24 క్రాఫ్ట్లు పనిచేస్తాయి. ఇందులో డెవలప్మెంట్, ప్రీ-ప్రొడక్షన్, ప్రొడక్షన్, పోస్ట్-ప్రొడక్షన్ వంటి నిర్మాణ దశలు కీలక పాత్ర పోషిస్తాయి. నిర్మాణ సంస్థ, డిస్ట్రిబ్యూషన్ కంపెనీలు, మార్కెటింగ్ పబ్లిసిటీ, థియేటర్ యజమానులు/ఎగ్జిబిటర్లు, సెన్సార్ బోర్డు, డిజిటల్ కంటెంట్ ప్రొవైడర్లు.. ఇలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసినప్పుడే ఒక సినిమా విజయవంతంగా ప్రేక్షకుల ముందుకు వస్తుంది. ఎలాంటి అడ్డంకులు లేకుండా సినిమా థియేటర్లలో రిలీజ్ చేయడం వెనుక డిస్ట్రిబ్యూటర్స్, ఎగ్జిబిటర్స్ కృషి ఎంతో ఉంటుంది. అందుకే వీరిని మేకర్స్ కు, ప్రేక్షకులకి మధ్య వారధులుగా పేర్కొంటారు.

### డిస్ట్రిబ్యూటర్లు అంటే ఎవరు?

'సినిమా'ను నిర్మాత నుంచి కొనుగోలు చేసి, దానిని థియేటర్లకు చేరవేసే వ్యక్తులు లేదా సంస్థలను 'డిస్ట్రిబ్యూటర్లు' అంటారు. వీరు సినిమాను మార్కెటింగ్ చేయడంలో, ప్రమోట్ చేయడంలో, థియేటర్లలో సినిమాని రిలీజ్ చేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తారు. ప్రొడ్యూసర్స్ నుంచి సినిమా థియేట్రికల్ హక్కులను తీసుకోవడమే కాదు.. ఆ సినిమాను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి పబ్లిసిటీ, ప్రమోషన్ కార్యక్రమాలు చేపడతారు. సినిమాను ప్రదర్శించడానికి ఎగ్జిబిటర్లతో ఒప్పందాలు కుదుర్చుకొని థియేటర్లను ఫిక్స్ చేస్తారు. నిర్మాతలకు పెట్టుబడి తిరిగి వచ్చేలా చూడటంలో కీలకంగా వ్యవహరిస్తారు.



### ఎగ్జిబిటర్లు అంటే ఎవరు?

సినీ భాషలో ఎగ్జిబిటర్లు అంటే థియేటర్ యజమానులు లేదా సినిమా హాళ్లను లీజుకు తీసుకునే వ్యక్తులు. వీరు డిస్ట్రిబ్యూటర్ల నుంచి సినిమాలను తీసుకొని థియేటర్లలో ప్రదర్శిస్తారు. మల్టీప్లెక్స్‌లు, సింగిల్ స్క్రీన్ థియేటర్లు ఎగ్జిబిటర్ల పరిధిలోకి వస్తాయి. థియేటర్ల నిర్వహణ, సౌకర్యాలు, సౌండ్ సిస్టమ్, స్క్రీన్ నాణ్యత వంటివి చూసుకుంటారు. ప్రేక్షకులకు సినిమా టికెట్లను విక్రయించి, వచ్చిన కలెక్షన్స్ వివరాలను పంపిణీదారులు చేరవేస్తారు. టికెట్ల అమ్మకం ద్వారా వచ్చిన ఆదాయాన్ని ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం డిస్ట్రిబ్యూటర్లతో పంచుకుంటారు. ఈ విషయం మీదనే గత కొన్ని రోజులుగా ఇండస్ట్రీలో వివాదాలు జరుగుతున్నాయి.

### ఎగ్జిబిటర్ల సమస్య ఏంటి?

టాలీవుడ్ లో రెంటల్ సిస్టమ్, పర్సంటేజీ విధానం ద్వారా సినిమాలను రిలీజ్ చేస్తూ ఉంటారు. మల్టీప్లెక్స్‌లలో పర్సంటేజ్ విధానం ఉంటే.. సింగిల్ స్క్రీన్ థియేటర్లలో మాత్రం రెంట్ లేదా పర్సంటేజ్ విధానం నడుస్తోంది. ఏదైనా సినిమాకి మొదటి వారం మంచి రెవెన్యూ వస్తే రెంట్ ఇస్తున్నారు.. సెకండ్ వీక్ లో కలెక్షన్లు తగ్గిన తర్వాత పర్సంటేజ్ ఇస్తున్నారు. అయితే దీని కారణంగా తాము ఆదాయాన్ని కోల్పోతున్నామని ఎగ్జిబిటర్స్ భావిస్తున్నారు. అందుకే రెంట్ ప్రాతిపదికన థియేటర్లలో సినిమాలు విడుదల చెయ్యకుండా, మల్టీప్లెక్స్ తరహాలోనే వసూళ్లలో పర్సంటేజీ ఇచ్చే విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఆ అంశం మీదనే డిస్ట్రిబ్యూటర్స్, ఎగ్జిబిటర్స్, ప్రొడ్యూసర్స్ గత కొన్నాళ్లుగా చర్చలు జరుపుతున్నారు.

### 25 ఏళ్లుగా పరిష్కారం కోసం ప్రయత్నాలు..

నిజానికి సింగిల్ స్క్రీన్ థియేటర్స్ సమస్య ఇప్పుడు కొత్తగా మొదలైంది కాదు. 25 ఏళ్ల నుంచే ఈ సమస్య కొనసాగుతోంది. కోవిడ్ పాండమిక్ తర్వాత థియేటర్ల పరిస్థితి మరీ దారుణంగా తయారైందనేది వాస్తవం. గడిచిన నాలుగేళ్లలో ఎన్నో సింగిల్ స్క్రీన్ థియేటర్లు మూతబడిపోయాయి. మరికొన్ని సినిమా హాళ్లు కళ్యాణ మండపాలుగా మారిపోయాయి. అయితే పర్సంటేజ్ సిస్టమ్ వల్ల సినీ ఇండస్ట్రీకి చాలా మేలు జరుగుతుందని, ఆ విధానం లేకపోవడం వల్ల సగటు నిర్మాత తీవ్రంగా నష్టపోతున్నాడని ఇటీవల ఆర్ నారాయణమూర్తి అభిప్రాయపడ్డారు.

భారతదేశంలో సినిమా అనేది సామాన్య ప్రేక్షకుడికి వినోదం. మాల్స్, మల్టీప్లెక్స్ లు వచ్చిన తర్వాత సింగిల్ థియేటర్లకు ఉనికి లేకుండా పోతుంది. ఒకప్పుడు తెలంగాణలో 500 ఉన్న థియేటర్లు ఇప్పుడు 200కు పడిపోయాయి. ఆంధ్రాలో 500కుపైగా ఉన్న సింగిల్ స్క్రీన్ 300కు తగ్గాయి. సింగిల్ స్క్రీన్ థియేటర్లు లేకపోతే సాధారణ ప్రేక్షకుల పరిస్థితి ఏంటి?. మాల్స్ లో బీభత్సమైన ధరలు ఉంటున్నాయి. పాప్ కార్న్ తింటే 500 రూపాయలా?, డ్రింక్ తాగితే 200 రూపాయలా?. ఇలా అయితే సగటు ప్రేక్షకులు ఎలా సినిమా చూడగలుగుతారు?, ఏ రకంగా సినిమా థియేటర్లకు వస్తారు?. ఈ విధానాలతో వినోదాన్ని సగటు మనిషికి దూరం చేస్తున్నారు. సింగిల్ థియేటర్లను బతికించుకోవాలి. దాని కోసం పర్సంటేజ్ విధానం కావాలి.

### థియేటర్లలో ఆడియన్స్ పర్సంటేజీ పెంచాలి..

ఇండస్ట్రీలో ఏర్పడిన సమస్యలకు ప్రధాన కారణం.. రోజు రోజుకూ సినిమాలు చూడటానికి థియేటర్లకు వచ్చే జనాల సంఖ్య తగ్గిపోవడం అనే అభిప్రాయాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. రెంట్లు, పర్సంటేజీలు, షేర్లు కంటే.. థియేటర్లలో ఆడియన్స్ పర్సంటేజీ పెంచే విషయంపై ఆలోచన చేస్తే అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుందనే మాట వినిపిస్తోంది. ప్రేక్షకులు సినిమాలు చూడటానికి థియేటర్లకు రావడం తగ్గిపోయిందని, ఆక్యుపెన్సీ పెరిగితే అన్ని సమస్యలు తీరిపోతాయని నిర్మాత ఎస్కేఎన్ ఆ మధ్య మీడియా మీట్ లో అన్నారు. మార్నింగ్ షోలకు వచ్చే ఆడియన్స్ తగ్గిపోతున్నారు. ఈవెనింగ్ షో, వీకెండ్స్‌లకు ఆడియన్స్ వస్తున్నారు. అన్ని రోజులు ఒకే రేట్స్ ఉండటం వల్ల కొంతమంది దూరం అవుతున్నారు. ఇతర రాష్ట్రాల్లో మాదిరిగానే ఫ్లెక్సిబుల్ రేట్లు పెట్టి ఎక్కువ మందిని రప్పించగలమా? వీకెండ్స్ లో కాస్త ఎక్కువ ధరలు పెట్టి, స్టూడెంట్స్ ను రప్పించాడనికి వీక్ డేస్ లో తగ్గిస్తే ఎలా ఉంటుంది? వంటి విషయాలపై దృష్టి పెడితే బాగుంటుంది'

### అధిక టికెట్ ధరలు..

ప్రేక్షకులు థియేటర్లకు దూరమవ్వడానికి అధిక టికెట్ ధరలు, క్యాంటీన్లలో స్నాక్స్ రేట్లు, పైరసీ భూతం, ఓటీటీ వేదికలు ప్రధాన కారణమే అభిప్రాయాలు కూడా ఉన్నాయి. భారీ బడ్జెట్ సినిమాలు తీసిన నిర్మాతలు.. ప్రభుత్వాల నుంచి ప్రత్యేక అనుమతులు టికెట్ రేట్లు తెచ్చుకోవడాన్ని మనం చూస్తున్నాం. డబ్బులు ఎక్కువ ఖర్చు పెట్టాం కాబట్టి, టికెట్ ధరలు కూడా దానికి తగ్గట్టుగానే ఉంటేనే పెట్టుబడి వెనక్కి వస్తుందనేది మేకర్స్ ఆలోచన. అందుకే టికెట్ రేట్లు పెంచేసి, మొదటి రెండు వారాల్లోనే కలెక్షన్స్ రాబట్టాలని చూస్తున్నారు.

### కీలకంగా మారిన ఓటీటీ డీల్స్..

మరోపక్క ఈరోజుల్లో ఎంత పెద్ద సినిమా అయినా, పెద్ద హీరోలు నటించిన బ్లాక్ బస్టర్ హిట్టయిన చిత్రమైనా నెల తిరక్కుండానే డిజిటల్ ఫ్లాట్ ఫామ్స్ లోకి వచ్చేస్తోంది. భారీ బడ్జెట్ సినిమాలకు ఓటీటీ డీల్స్ కీలకంగా మారడంతో, ఫిలిం మేకర్స్ ఫ్యాన్సీ రేటుకి డిజిటల్ రైట్స్ విక్రయిస్తున్నారు. ఓటీటీ సంస్థలు ఫిక్స్ చేసిన డేట్ ప్రకారమే థియేటర్లలో సినిమాని రిలీజ్ చేసే పరిస్థితి వచ్చింది. ఎలాగూ థియేటర్లకు జనాలు రావడం లేదు కాబట్టి, ఎర్లీ స్ట్రీమింగ్ ద్వారా ఎక్కువ డబ్బులు రాబడుతున్నాం అనేది నిర్మాతల వాదన.

శుక్రవారమే కొత్త సినిమాలు, శుక్రవారమే ఓటిటి విడుదలలు, శుక్రవారమే రీరిలీజులు అనే విధంగా కాకుండా.. వేర్వేరు రోజుల్లో సినిమాలను ప్లాన్ చేసుకోవాలని సినీ విశ్లేషకులు సూచిస్తున్నారు. అందరికీ అందుబాటులో ఉండేలా టికెట్ రేట్లు పెట్టి, కనీసం రెండు నెలల తర్వాతే ఓటీటీకి వస్తే మళ్ళీ ఎప్పటిలాగే థియేటర్లకు శోభ తిరిగి వస్తుందనే అభిప్రా యాలు వ్యక్తం చేస్తున్నారు. థియేటర్లకు ఆడియన్స్ వచ్చే కల్చర్ పెరిగితే.. ఆటోమేటిక్ గా ఎగ్జిబిటర్స్, డిస్ట్రిబ్యూటర్లకి మేలు జరుగుతుందని భావిస్తున్నారు. లేదంటే ఇండస్ట్రీకి గడ్డుకాలమే అని గట్టిగా హెచ్చరిస్తున్నారు. సినిమా అంటే అభిరుచితో థియేటర్లు కట్టుకున్నారు. సినిమా తల్లినే నమ్ముకున్నవాళ్లు. సినిమా థియేటర్ దేవాలయం. ఆ దేవాలయాలు బాగుండాలి. ఇవాళ ఎన్ని దేవాలయాలు కళ్యాణ మండపాలు అవుతున్నాయి, ఎన్ని దేవాలయాలు ఇవాళ మూతపడిపోతు న్నాయి. విధానంలో లోపాలే ఇందుకు కారణం. 'చిన చేపను పెద చేప... చిన మాయ ను పెను మాయ..అది స్వాహా ఇది స్వాహా' అని పింగళి నాగేంద్ర 'మాయాబ జార్'లో చెప్పినట్లుగా కార్పొరేట్ శక్తులు థియేటర్లను ఆక్రమించేస్తున్నాయి. పర్సంటేజ్ విధానం ఉంటేనే చిన్న నిర్మాతలు, థియేటర్ల యజమానులు బాగుంటారు.



### బడ్జెట్ పెరగడానికి హీరోలే కారణమా?

సినిమా బడ్జెట్ పెరగడానికి హీరోల రెమ్యునరేషన్లు కారణమనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఈరోజుల్లో స్టార్ హీరోల పారితోషికాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. సినిమా సినిమాకి పెంచుకుంటూ పోతున్నారు. నిర్మాతలు బడ్జెట్ లో ఎక్కువ శాతం హీరో రెమ్యునరేషనే కే కేటాయిస్తున్నారు. బడ్జెట్ పెరిగింది కాబట్టి, దాన్ని వెనక్కి తెచ్చుకోవడానికి టికెట్ రేట్లు పెంచి సాధారణ ప్రేక్షకుడి జేబులకు చిల్లులు పడేలా చేస్తున్నారు. ఎర్లీ ఓటీటీ స్ట్రీమింగ్ కి ఇచ్చి జనాలను థియేటర్లకు దూరం చేస్తున్నారు. ప్రేక్షకులు రాకపోవడంతో చివరకు ఎగ్జిబిటర్స్ నష్టపోతున్నారు. ఇలా ఇదంతా ఒక సైకిల్ మాదిరిగా జరుగుతోంది. అయితే పెద్ద హీరోలు ఏడాదికి రెండు సినిమాలు తీస్తే ఈ సమస్యలు ఏమి ఉండవనే మాట డిస్ట్రిబ్యూషన్, ఎగ్జిబిటర్ సెక్టార్స్ నుంచి వినిపిస్తోంది

ఎగ్జిబిటర్స్, ప్రొడ్యూసర్స్ గ్రహించవలసింది, కరెక్ట్ చేసుకోవాల్సింది పర్సంటేజ్ సిస్టం కాదు.. ప్రేక్షకులను తిరిగి థియేటర్లకు రప్పించడం ఎలా అని! ఇప్పుడున్న అర్ధ రూపాయి వ్యాపారంలో నీది పావలా.. నాది పావలా అని కొట్టుకోవడం కాదు.. మునుపటిలా మన వ్యాపారాన్ని రూపాయికి ఎలా తీసుకెళ్లాలి అనేది ఆలోచించాలి. సినిమా విడుదలైన 28 రోజుల్లోపే ఓటిటికి ఇవ్వాలి అనే ట్రెండ్ కొనసాగితే.. రాబోయే నాలుగైదు ఏళ్లలో 90 శాతం సింగిల్ స్క్రీన్స్ మూసుకుపోతాయి. ఈ విషయం పెద్ద హీరోలు కూడా ఆలోచించాలి. మీరు రెండు సంవత్సరాలకు ఒక సినిమా మూడు సంవత్సరాలకు ఒక సినిమా చేస్తూ పోతే థియేటర్ల నుంచి ప్రేక్షకులు కూడా దూరమై పోతారు. ఆ రెండు మూడేళ్లలో చాలామంది థియేటర్ ఓనర్స్ వాటిని మెయింటైన్ చేయలేక మూసేస్తారు. పెద్ద హీరోలందరూ గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే.. సింగిల్ స్క్రీన్స్ మూత పడినట్టైతే, మీ సినిమాకి వచ్చే ఆదాయం కేవలం 43% మాత్రమే.

బన్నీవాసు



### థియేటర్లకు దూరమవుతున్న సామాన్య ప్రేక్షకులు..

కానీ ఇక్కడ అధిక టికెట్ రేట్లు, ఎర్లీ ఓటీటీ స్ట్రీమింగ్ కారణంగా థియేటర్లకు వచ్చే ప్రేక్షకుల సంఖ్య తగ్గిపోతూ వస్తోంది. విచ్చలవిడిగా ధరలు పెంచడం వల్ల సామాన్యులకు సినీ వినోదం భారంగా మారుతోంది. ఇది పరోక్షంగా పైరసీని ఎంకరేజ్ చేసేలా చేస్తోంది. దీనికి తోడు మూడు నాలుగు వారాలకే ఓటీటీలోకి వస్తుండటంతో.. అంత ఖర్చు చేసి థియేటర్లకు వెళ్లడం ఎందుకులే అని ఆలోచించే పరిస్థితి వచ్చింది. ఇది డిస్ట్రిబ్యూటర్ల ఆదాయాన్ని తగ్గించడమే కాదు, థియేటర్ల యజమానులకు నష్టాలను తెచ్చిపెడుతోంది. ఈ నేపథ్యంలో హిందీ, తమిళంలో మాదిరిగానే తెలుగులోనూ కచ్చితంగా 8 వారాల తర్వాతే సినిమా ఓటీటీలోకి వచ్చేలా డీల్స్ కుదుర్చుకోవాలనే డిమాండ్ తెర మీదకు తీసుకొస్తున్నారు.

పెద్ద నిర్మాతలు కోట్లు ఖర్చు పెట్టి సినిమాలు తీస్తున్నారు. వాళ్లకు డబ్బుంది, పెడుతున్నారు. కానీ సినిమాకు చాలా ఖర్చైంది కాబట్టి విడుదల కు ముందు టికెట్ ధరలు పెంచితే మేం లాభ పడతామని అనుకుంటున్నారు. ప్రభుత్వాలు కూడా వాటిని ఆమోదించడం వల్ల సగటు చిత్రాలకు, సినీ పరిశ్రమకు, ప్రేక్షకులకు తీరని నష్టం జరుగుతోంది. పేద వాడు, డబ్బున్నవాడు ఇద్దరూ సినిమా చూడాలనుకుంటారు. డబ్బులు న్నవాళ్లు హ్యాపీగా సినిమా చూస్తారు. పేదవాడు మాత్రం అప్పు చేసి సినిమా చూడాల్సి వస్తోంది. కనీసం రూ.1000 నుంచి రూ.1500 ఉంటే గానీ ఇవాళ సినిమా చూడలేకపోతు న్నారు. ప్రేక్షకుడికి చవకగా దొరికే సినిమా.. ఇవాళ చాలా ఖరీదుగా మారింది. భారీ సినిమాలు తీస్తున్నాం అని ప్రేక్షకుడి మీద రుద్దితే ఎలా?

ఆర్ నారాయణ మూర్తి

Printed, Edited by , Published and Owned by .M Chandrasekhar Address Plot No 12. Journalist. Colony .Near. B.T.R.Nagar. vaartha Office Back Side .KG Road. Kurnool. Andhra Pradesh .Pincode 518 001
Printed at Uttejitha printer's, KURNOOL. AP. Cell No. 9440140418, RNI APTEL/2008/24570 ,